# ఒప్పందం

"రమ్యా! నీకు ఫోన్" రూమ్‌మేట్ సౌజన్య గుమ్మంలోంచి లోపలికి తొంగిచూసి అరిచి ఎటో వెళ్లిపోయింది. రమ్య ఒక్క ఉదుటున లేచి ఆఫీస్‌రూమ్‌లోకి పరిగెత్తింది. ఫోన్‌కాల్ మాట్లాడేసి వచ్చిన రమ్య మనసంతా ఉల్లాసంగా మారిపోయింది.

ఎంత మంచివార్త చెప్పాడు సురేష్! తన కల నెరవేరబోతోంది. కలా! అవును కలే!

ఆడదానికి తనదైన ఓ ఇంట్లో స్వతంత్రంగా జీవించడం అనేది ఓ కలే. ఆ కల నెరవేరబోతోంది.

రమ్య కూనిరాగం తీస్తూ రూమంతా కలియతిరిగింది.

రెండు మంచాలు. రెండు టేబుల్స్, రెండు కుర్చీలు, ఓ కూజా, రెండు ప్లాస్టిక్ మగ్‌లు, ఓ ఫ్లాస్క్, టేబుల్స్, కుర్చీలు హాస్టల్ వాళ్లవి. ఒక బకెట్, ఒక మగ్, ఫ్లాస్క్ తనవి. ఫ్లాస్క్ ఈమధ్యే కొంది. ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఏడాది గడిపింది. రూమ్మేట్ సౌజన్య సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోంది. తను ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్‌లో పి.ఆర్.ఓ. సౌజన్య మంచి స్నేహశీలి. ఏడాదిగా తామిద్దరి మధ్యా ఎంతో సాన్నిహిత్యం పెరిగింది. రోజూ రాత్రిళ్లు ఒకళ్ల మనసులోని భావాలు మరొకరితో పంచుకుంటూ ఆత్మీయంగా కలిసిపోయిన తీయటి స్నేహం.

బహుశా ఇంక ఇరవైనాలుగు గంటల్లో తను వెళ్లిపోతుంది. కేవలం ఒక్క సూట్‌కేస్, ఓ ఎయిర్ బ్యాగ్ తీసుకుని తనిక్కడి నుంచి వెళ్లిపోతుంది.

పాపం! సౌజన్య మరో రూమ్‌మేట్ దొరికే దాకా ఒక్కతే ఉండిపోతుంది.

తనని అర్థం చేసుకుని ప్రాణంలో ప్రాణంగా కలిసిపోయే ఓ సహచరుడి కోసం అన్వేషిస్తూ ఎదురుచూస్తూ ఇలా ఎంతకాలం ఈ హాస్టల్లో ఉండిపోతుందో!

రమ్య మనసు ఆలోచనా సాగరంలో అలల మధ్య ఊగుతున్నట్టుగా ఉంది. ఇన్నాళ్ల నుంచీ సౌజన్య దగ్గర దాచిన ఒకే ఒక్క రహస్యం ఇవాళ రాత్రికి చెప్పేయాలి.

ఏమంటుందో తన నిర్ణయం విని.

అసలే తన భావాలన్నీ అతిగా, విచిత్రంగా అన్పిస్తాయి ఆమెకి.

సురేష్‌ని జీవిత భాగస్వామిగా... కాదు కాదు సహచరుడిగా కాదుకాదు... జీవన నేస్తంగా తన జీవితంలోకి ఆహ్వానిస్తున్నట్టు తెలిస్తే ఏమంటుంది?

ముందు అదిరిపడుతుంది. తరువాత ఆశ్చర్యపోతుంది. తరువాత తరువాత... రమ్య పెదాలపైన ఓ చిరునవ్వు మెరిసింది.

లేచి గబగబా దండెం మీద, మంచం మీద చిందరవందరగా పడి ఉన్న బట్టలన్నీ మడతపెట్టి సూట్‌కేస్‌లో సర్దింది. మిగతావి బ్యాగ్‌లో సర్దింది.

అరగంటలో తయారై మెస్‌కి వెళ్లింది.

సాంబారు, బీన్స్ కూర, అన్నం...

ఈ రొటీన్ తిండికి ఇంక ఇరవైనాలుగు గంటల్లో గుడ్‌బై చెప్పబోతోంది.

"హాయ్ రమ్యా! ఏమిటివాళ లేట్ అయింది. ఆఫీస్‌కి వెళ్లడంలేదా?" కంచంలో సాంబారు వేసుకుంటూ అడిగింది మనీష.

"వెళ్తున్నాను. నువ్వు పోవా?"

"ఊహు..." అని కొంచెం రహస్యంగా "నా బాయ్‌ఫ్రెండ్ వస్తున్నాడు పిక్చర్‌కి వెళ్తున్నాను" అంది.

"గుడ్‌లక్" అంది.

కొంచెం అన్నం తినేసి చేయి కడుక్కుని బైటికి వచ్చేసింది.

బ్యాంక్‌కి వెళ్లి డబ్బులు డ్రా చేసి ఆఫీస్‌కెళ్లింది. ఆ రోజు పనేమీ చేయాలనిపించలేదు.

మనసంతా ఎంతో హాయిగా ఉంది. గంటలు నిమిషాలు లెక్కపెట్టుకుంటూ గడిపింది. సరిగ్గా ఐదయింది. ఒక్క ఉదుటున పర్స్ తీసుకుని బైటికొచ్చేసింది. ఆటో తీసుకుని పిక్ అండ్ మూవ్‌కెళ్లింది. సురేష్ చిరునవ్వుతో ఎదురొచ్చాడు.

"హాయ్!" పలకరించింది.

"ముందు ఫ్లాట్ చూసి వద్దామా? ఐస్‌క్రీమ్ తిందామా?" అడిగాడు సురేష్.

"ఐస్‌క్రీమ్"

ఇద్దరూ లోపలికి నడిచారు.

రెయిన్‌బో ఐస్‌క్రీమ్ ఆర్డర్ చేశాడు.

"ఫ్లాట్ ఎంత బాగుందో తెలుసా?"

"ప్రైవసీ ఉందా?"

"బోల్డంత. మనిద్దరం రేపు రాత్రి నుంచే 'డోంట్ డిస్టర్బ్' బోర్డ్ పెట్టుకుంటే వారం దాకా ఎవరూ అడగరు."

నవ్వింది. "వారం దాటాక పోలీస్ హెల్ప్‌తో తలుపులు విరగ్గొడతారేమో!"

"అపశకున పక్షి"

ఐస్‌క్రీమ్ వచ్చింది.

"మన అనుబంధానికున్న ఆటంకాలన్నీ తొలగిపోతాయి. మీ వార్డెన్ తిడుతుందని తొమ్మిదింటికే పరిగెత్తుకెళ్లక్కర్లేదు."

"అప్పుడేనా! కొన్నికొన్ని సమస్యలు ఇప్పట్నించే ప్రారంభం అవుతాయి. నా మీద నీకున్న ప్రేమని పరీక్షించే సమస్యలు" ఐస్‌క్రీమ్ సుతారంగా చప్పరిస్తూ అంది.

"అలా అనకు భయమేస్తుంది" తన చేతిలో స్పూన్ ఆమె చేతికి అందించాడు.

"ఇంత తీయగా ఉందేం!?"

"ఇందులో నా ప్రేమానురాగాలు కలిపాను."

"ఊ" నవ్వింది.

అరగంటలో ఇద్దరూ కలిసి గగన్‌మహల్ నర్సింగ్‌హోమ్‌కి దగ్గరగా ఉన్న అపార్ట్‌మెంట్స్‌కి వెళ్లారు.

ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ చూడగానే రమ్య మనసుని దోచుకుంది. బొమ్మరిల్లులా వుంది ఆ ఫ్లాట్... బెడ్‌రూమ్‌కి అటాచ్ అయి ఉన్న సిట్ అవుట్.

"బాగుంది. కానీ ఇక్కడ్నించి చూస్తే ఈ రోడ్లు, వాహనాలు, మనుషులు కాకుండా పచ్చని చెట్లు, నీలాకాశం కన్పిస్తే ఎంత బాగుంటుందో!" కొంచెం నిరాశ వ్యక్తంచేసింది.

"తల్లీ! సిటీకి మధ్యలో చెట్లు, పుట్టలు ఎక్కడ్నించి వస్తాయి? అదిగో ఆకాశం అది చూడు" అన్నాడు పైకి చూస్తూ.

రమ్య నవ్వి అతని చెంపమీద సున్నితంగా కొట్టింది.

"అడ్వాన్స్ ఇచ్చేద్దామా?" అడిగింది పర్స్ జిప్ తీస్తూ.

"ఇచ్చేశాను. అందుకే కీ నా దగ్గరుంది."

"ఇచ్చేశావా? నాకు నచ్చకపోతే"

"నీకు నచ్చుతుందని నాకు తెలుసు. ఏడాదిన్నర మన స్నేహంలో నీ అభిరుచి నాకు తెలీదా?"

బెడ్‌రూమ్‌కి నడిచిన సురేష్ ఆమెని అనుసరించి హఠాత్తుగా ఆమె చేయి పట్టి దగ్గరికి లాక్కున్నాడు.

"రమ్యా! ఇహ నుంచీ మనం కలుసుకోడానికి పార్క్‌లూ, ఐస్‌క్రీమ్ పార్లర్లూ, ట్యాంక్‌బండ్ ఏవీ అఖ్ఖర్లేదు. మనింట్లో మనం కలుసుకోవచ్చు కదూ!"

"ఇది మనిల్లు" గర్వంగా అంది అతణ్ణి పెనవేసుకుపోతూ.

"అవును మనిల్లు. రేపట్నించీ ఈ చిన్న సామ్రాజ్యానికి మనమే చక్రవర్తులం". సురేష్ ఆమెని ఇంకా దగ్గరగా తీసుకున్నాడు.

"సంతోషించాం. ఇంక ఈ జోరు తగ్గించండి" అతణ్ణి విడిపించుకుని చిలిపిగా నవ్వింది.

"అబ్బా! ఇంకా ఏమిటి రమ్యా ఈ రిస్ట్రిక్షన్స్" గారంగా అన్నాడు.

"పవళించగా పూలపానుపు లేదు, తల ఊనగ పట్టు తలగడయే లేదు. జలకాలాడగ పన్నీరు లేదు" సన్నగా రాగం తీసింది.

"నీ కౌగిలిలో నాకు అన్నీ..." మళ్లీ దగ్గరకు లాక్కున్నాడు.

"ఏయ్! డోంట్ బీ సిల్లీ" అతడి చెంప మీద ముద్దు పెట్టుకుని విడిపించుకుంది.

"పద వెళ్దాం"

ఉసూరుమంటూ ఆమెని అనుసరించి బైటికి నడిచాడు.

ఎనిమిదింటికి రమ్యని హాస్టల్ దగ్గర దింపేసి "గుడ్‌నైట్" చెప్పి వెళ్లిపోయాడు సురేష్.

కూనిరాగాలు తీస్తూ హుషారుగా ఉన్న రమ్యని, సర్ది ఉన్న సూట్‌కేస్, బ్యాగులను చూస్తూ అడిగింది సౌజన్య ఆ రాత్రి.

"ఊరెళుతున్నావా రమ్యా!"

డిమ్‌గా వెలుగుతున్న బెడ్‌లైట్ చూస్తూ "ఊహూ... రూమ్ ఖాళీ చేస్తున్నాను"

అంది.

"వ్వాట్!" ఆశ్చర్యంగా చూసింది సౌజన్య.

"అదేంటి అంత సడన్‌గా?"

రమ్య పక్కకి ఒత్తిగిల్లి చిరునవ్వుతో సౌజన్యని చూస్తూ "నీకిది సడన్ న్యూస్. షాకింగ్ న్యూస్. కానీ నేనీ నిర్ణయానికి వచ్చి నాలుగు నెలలైంది" అంది.

"మరి నాకు చెప్పలేదేం? అసలెందుకు తీసుకున్నావీ నిర్ణయం?" అనుమానంగా చూసింది సౌజన్య.

రమ్య తన మంచం మీంచి లేచి సౌజన్య మంచంమీదకి చేరి "జరుగు" అంది.

సౌజన్య పక్కకి ఒత్తిగిల్లి రమ్యకి చోటిచ్చింది.

రమ్య ఆమె పక్కన పడుకుని "రేపట్నించీ నీ ఈ ప్లేస్‌లో సురేష్ ఉంటాడు" అంది.

"సురేషా! ఎలా?" విస్తుబోయింది సౌజన్య.

"పెళ్లి చేసుకున్నావా?" సీరియస్‌గా అడిగింది.

"పెళ్ళా!" నవ్వింది రమ్య. "సౌజన్యా! పెళ్లి, తాళి, బాజాలు నాకు వీటన్నిటి మీదా నమ్మకం లేదు. నేను సురేష్‌తో బతకాలని నిశ్చయించుకున్నాను."

"పెళ్లి కాకుండానా?"

"ఏం? ఏమవుతుంది?"

"మతిపోయిందా? మనం ఉన్నది ఇండియాలో. ఇక్కడ పెళ్లికాకుండా కలిసి బతికేవాళ్లని ఏమంటారో తెలుసా?"

"ఎవరేమన్నా, అనుకున్నా నాకనవసరం. ఇది నా జీవితం. నా జీవితాన్ని నాకు నచ్చిన విధంగా మలుచుకునే హక్కు నాకుంది. సౌజన్యా! నాకెందుకో పెళ్లి అనే తంతు ఇష్టంలేదు. పెళ్లి పేరుతో ఓ మగవాడు నా మెళ్లో ఓ తాడు బిగించి నామీద పెత్తనం చేయటం నేను సహించలేను. నేను పూర్తి స్వతంత్రురాల్ని. అలా ఉండడమే నాకిష్టం. అంతేకాదు, ఇంకో విషయం చెప్తే నీ గుండె ఆగిపోతుందేమో!"

"ఏమిటది?"

"సురేష్‌కి ఆల్‌రెడీ పెళ్లైంది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు." ఈసారి

సౌజన్యకి నిజంగానే షాక్ తగిలినట్లైంది.

"అక్రమ సంబంధం పెట్టుకుంటున్నావా?" తీవ్రంగా చూసింది.

"నువ్వే పేరైనా పెట్టు కానీ నాకిదే సక్రమం అన్పిస్తోంది. ఎందుకంటే పెళ్లికాని వాడైతే నాకు బాధ్యతలుంటాయి. నేను ఫ్రీ బర్డ్‌లా బతకాలనుకుంటు న్నాను. భర్త, పిల్లలు వాళ్లకి వండి వార్చడాలు... సేవలు చేయడాలు ఇవన్నీ నాకు బోర్. నాకు జీవితం ఎప్పుడూ నిత్య నూతనంగా, రసవత్తరంగా ఉండాలి. యాంత్రికం కాకూడదు."

సౌజన్య కోపంగా చూస్తూ అంది, "నిజంగానే నీకు పిచ్చెక్కింది. ఇంతకీ ఈ సురేష్ నీకెలా తగిలాడు?"

సౌజన్య కోపాన్ని మురిపెంగా చూస్తూ అంది రమ్య. "ఎల్ఐసి ఆఫీసులో పనిచేస్తున్నాడు సురేష్. సుమారు ఏడాదిన్నర అవుతోంది, నేనతని దగ్గర ఓ పాలసీ తీసుకున్నాను. తరవాత తరవాత అప్పుడప్పుడు కలుసుకోవడం, నెమ్మదిగా స్నేహం పెరిగింది. తొలిచూపు ప్రేమ కాకపోయినా అతనంటే నాలో ఏదో ఒక ఆకర్షణ కలిగింది. అతను కూడా నన్ను అభిమానిస్తున్నాడని అర్థం చేసుకున్నాను. మా ఇద్దరి ఆలోచనలూ, అభిప్రాయాలు, అభిరుచులు కలిశాయి. అయితే ఓరోజు హఠాత్తుగా తెలిసింది నాకు అతనికి అప్పటికే పెళ్లైందని, పిల్లలున్నారని. ముందు కోపం తెచ్చుకున్నాను. మండిపడ్డాను. బాధపడ్డాను. ఆ తరువాత ఆలోచిస్తే అనిపించింది ఇదీ ఒకందుకు మంచిదే అని"

సౌజన్య ఓ విచిత్ర వ్యక్తిని చూస్తున్నట్టు చూస్తూ రమ్య చెప్పేది వింటోంది.

రమ్య మళ్లీ చెప్పసాగింది. "భర్త అనే పేరుతో ఓ వ్యక్తి రోజూ ఇరవై నాలు గ్గంటలూ నాతో కలిసి బతకడం, ఇద్దరం అనుక్షణం ఒకరి ఎదురుగా ఒకరుం డడం, నిద్ర లేవడం, పడుకోవడం, తినడం, ఆఫీస్‌కెళ్లడం, అలిసిపోయి రావడం, కీచులాటలు, అపార్థాలు, అనుమానాలు, అధికారాల కోసం ఆరాటం ఇవన్నీ నాకిష్టంలేదు. మేమిద్దరం కలిసి బతకాలనుకుంటున్నాం. కానీ రొటీన్ భార్యాభర్తల్లా కాదు. మంచి స్నేహితుల్లా. మా సంతోషాలు, అనుభూతులు పంచుకుంటూ ఎప్పటికప్పుడు మా కలయిక కొత్తగా అపూర్వంగా ఉండేలా మలచుకుంటాం. నా జీవితం నాది. అతని జీవితం అతనిది. ఒకళ్ల మీద ఒకళ్ల పెత్తనాలు లేవు. ఉండవు. అమూల్యమైన కాలం అంతా భర్త సేవల్లో గడిపేస్తూ కేవలం గృహిణిలా బతకడం నాకహస్యం. నేను సాధించాల్సినవెన్నో ఉన్నాయి. నేను పిహెచ్‌డి చేయా లనుకుంటున్నాను. నాకోసం, నా అభివృద్ధి కోసం కాలం మిగుల్చుకోవాలను

కుంటే నాకిలాంటి జీవితమే కావాలి"

సౌజన్య కొంచెం చిరాగ్గా అంది, "అలాంటప్పుడు అతనితో ఈ బతుకు కూడా ఎందుకు? వంటరిగా బతకచ్చుగా. అన్నీ అయ్యాకే పెళ్లి చేసుకో."

"బతకచ్చు కానీ కాలంకన్నా అమూల్యమైంది యవ్వనం. ఆ యవ్వనం కరిగిపోయిన తరువాత జీవితంలో అనుభవించడానికి ఏం మిగిలి ఉంటుంది?"

"అంటే నీకు ఓ మగవాడు కావాలి కానీ భర్త వద్దు అంతేనా?"

"పొరపాటు సౌజన్యా, నాకు ఓ స్నేహితుడు కావాలి. మానసికంగా, శారీరకంగా నాతో కలిసిపోయి నన్ను ఆనందింపచేసే ఆత్మీయుడు కావాలి. సురేష్‌ని నేను ప్రేమిస్తున్నాను. అతనికన్నా గొప్పగా నన్నెవరూ అర్థం చేసుకోలేరీ ప్రపంచంలో. ప్రేమించాను కదా అని నేనతనికి భార్యనై అతణ్ణి నా గుప్పిట్లో ఉంచుకోవాలన్న నీచమైన కోరిక నాకు లేదు"

"మరి ఈ సంఘానికి సమాధానం ఏం చెప్తావు?"

"ఎందుకు చెప్పాలి? నా బతుకుని ప్రశ్నించే అధికారం ఈ సంఘానికెక్కడిది?"

"మనం సంఘజీవులం కాబట్టి"

"కావచ్చు, సంఘజీవిని కాబట్టే మేమానందించడానికి ఓ ఇల్లు, వాకిలీ చూసుకున్నాం. లేకపోతే పచ్చికబయలే పాన్పుగా, నీలాకాశమే దుప్పటిగా హాయిగా, స్వేచ్ఛగా ఉండేవాళ్లం."

"పిల్లలు పుడితే?"

"ఎలా పుడతారు? నా ఇష్టం లేకుండా పుట్టేస్తారా? అలా పుట్టకుండా ఏంచేయాలో నాకు తెలుసు. ఒకవేళ పుట్టినా ఏం? ఏమవుతుంది?"

"వాళ్లకి తండ్రిగా సురేష్‌ని పరిచయం చేయగలవా?"

"నీవన్నీ అర్థంలేని సందేహాలు సౌజన్యా! నేను బతికేది సురేష్‌తో అయినప్పుడు అతడు నా పిల్లల తండ్రి అని ఎందుకు చెప్పుకోను? అయినా ఈ విషయం ప్రస్తుతం అప్రస్తుతం. నేనిప్పుడప్పుడే పిల్లల్ని కనాలనుకోవడంలేదు."

"కానీ ఇలా ఎంతకాలం గడుపుతావు? ఎప్పటికైనా పెళ్లి చేసుకోవాలిగా! అప్పుడు సురేష్‌ని చేసుకుంటే నీ పెళ్లి చెల్లుతుందా?"

రమ్య, సౌజన్య వైపు నిదానంగా చూసింది.

"చూడూ! నా దృష్టిలో పెళ్లి అనివార్యం కాదు. పెళ్లంటే ఓ తాళి వేసుకోవడం! అంతేగా! ఇందులో చెల్లకపోడానికేముంది? సురేష్ డబ్బు మీదా, ఆస్తిమీదా నేను అధికారాలు కోరినప్పుడు పెళ్లి చెల్లడం చెల్లకపోవడం అనే లీగల్ పాయింట్ వస్తుంది. మామధ్య కమర్షియల్ డీలింగ్స్ లేవు. ఐ లవ్ సురేష్. హి లవ్స్మీ. అంతే మా ప్రేమ సాక్షిగా మేము కలిసి బతకాలని నిశ్చయించుకున్నాం."

"ఏమో రమ్యా! నీ ధోరణి వింతగా ఉంది. ఏటికి ఎదురీదుతున్నావేమో అనిపిస్తోంది. ఎంతవరకూ సక్సెస్ అవుతావో!" నిట్టూరుస్తూ అంది సౌజన్య.

రమ్య చిరునవ్వుతో "నా గురించి ఎక్కువగా ఆలోచించకు. హాయిగా నిద్రపో. గుడ్నైట్" అంటూ లేచి తన మంచం మీదికి వెళ్లిపోయింది.

రమ్య కాసేపట్లో నిద్రపోయింది. వివాహం పట్లా, భర్త పట్లా నిర్దుష్టమైన అభిప్రాయాలు కలిగి ఉన్న సౌజన్యకి మాత్రం చాలాసేపటి దాకా నిద్రపట్టలేదు.

మర్నాడే రమ్య రూమ్ ఖాళీ చేసింది.

సురేష్తో బజారుకెళ్లి చాప, రెండు తలగడలూ, కొంచెం స్టీలు సామానూ, ఒక స్టవ్ కొంది. ఓ ఫోల్డింగ్ కాట్, కొంత ప్లాస్టిక్ సామాను కూడా కొంది. సురేష్ డబ్బివ్వబోతే తీసుకోలేదు. రెండురోజుల్లో ఓ ముచ్చటైన చిన్న సంసారం ఏర్పడింది రమ్యకి.

కొంచెం పాతబడిన లేత నీలంరంగు పూలున్న షిఫాన్ చీర చింపి కిటికీలకూ, గుమ్మాలకీ కర్టెన్లు కట్టింది.

సురేష్ ఓ పదిరోజుల దాకా రెండు రోజులకోసారి వచ్చాడు.

చప్పటి సాంబారు, పీచు తీయని బీన్స్ కూర తినలేకా, బ్రెడ్, ఫాస్ట్ఫుడ్స్తో కడుపు నింపుకున్న రమ్యకి తన చేత్తో వండుకుని తినడం హాయిగా అన్పిస్తోంది.

"నీకు వంట చేయడం బాగానే వచ్చే" అన్నాడు సురేష్ ఆరోజు గుత్తి వంకాయ తింటూ.

"వంట చేయడం నా హాబీ. నీకు రాదా?" అడిగింది.

"ఎప్పుడూ చేయలేదు. అవసరం రాలేదు. తను వాళ్లమ్మగారింటికి వెళితే, మా అమ్మ వండుతుంది" అన్నాడు.

"ఇక్కడ అవసరం రావచ్చు, నేర్చుకో" నవ్వింది.

"చిత్తం" వాష్బేసిన్ దగ్గరకెళ్లి చేయి కడుక్కున్నాడు. ఇద్దరూ భోజనం పూర్తిచేశాక, వంటగది సర్దేశారు.

"పనిమనిషిని మాట్లాడుకోకూడదూ" అన్నాడు కంచాలు కడుగుతున్న రమ్యతో.

"వద్దు, మనిద్దరి మధ్యా మూడోవ్యక్తి ఉండడం నాకిష్టంలేదు. పైగా పనివాళ్లకి అన్నీ ఆరాలు కావాలి"

"నిజమే, వద్దులే" ఆమె కడిగినవన్నీ సర్దేశాడు.

హాల్లోకి రాగానే "రమ్యా ఇప్పుడే వస్తాను, తనకి ఒంట్లో బాగాలేదు. ఎలా ఉందో! ఓసారి ఫోన్ చేసి వస్తాను" అన్నాడు.

"ఓ.కె. వెళ్లిరా"

సురేష్ కిందికి వెళ్లాడు. రమ్య మంచం వాల్చి బ్లాంకెట్ మార్చింది. తలగడలు సర్ది కప్పుకోడానికి రెండు బ్లాంకెట్‌లు పెట్టింది. అగరువత్తులు వెలిగించింది. సాయంత్రం వస్తూవస్తూ కొనుక్కొచ్చిన మల్లెపూలదండ జడలో తురుముకుంది. చీర మార్చుకుని నైటీ వేసుకుంది.

కిటికీ రెక్క తెరిచింది. బైట వాతావరణం హాయిగా ఉంది. చల్లగాలి వీస్తోంది. నల్లని ఆకాశంలో నవ్వులు చిందిస్తున్న చందమామ మిణుకుమంటోన్న తారలు. ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది. వివిధభారతిలో పాత హిందీ పాట "ఏ రాహే ఏ మౌసమ్ నదీకా కినారా... ఏ చంచల్ హవా" గుండెనిండా పులకరింతలు.

సురేష్ కిందికెళ్ళి పదిహేను నిమిషాలైంది. అసహనంగా కిటికీలోంచి బైటికి చూసింది. రోడ్డుదాటి, హడావుడిగా వస్తున్నాడు సురేష్.

***

రమ్య సంసార రథం రసరమ్యంగా సాగిపోతోంది. హాస్టల్‌కి వచ్చిన ఉత్తరాలు తెచ్చిచ్చింది సౌజన్య. తండ్రి సంబంధాలు వెతికి వరుళ్ళ వివరాలు తెలుపుతూ రాసిన ఉత్తరాలు మూడు.

అన్నిటికీ కలిపి ఓ సుముహూర్తంలో జవాబు రాసి పడేసింది.

నాన్నగార్కి,

నాకు సంబంధాలు వెతకద్దు. నా ఫ్రెండ్ సురేష్‌తో కలిసి బతకడానికి నిర్ణయించుకున్నాను. అమ్మకి నమస్కారాలు...

"కలిసి బ్రతకడం" అంటే అర్థంకాని రమాకాంత్, భువనేశ్వరి తిరుగు టపాలో వచ్చారు రమ్య రాసిన అడ్రస్ వెతుక్కొంటూ. ఉదయాన్నే దిగిన తల్లి దండ్రుల్ని చూసి ముందు బోల్డంత ఆశ్చర్యపోయినా తరవాత చాలా ఆనందించింది

రమ్య.

"ఉత్తరం రాస్తే స్టేషన్‌కి వచ్చేదాన్నిగా" అంది, తల్లి చేతిలో సూట్‌కేస్ అందుకుంటూ.

ఆవిడ రమ్య మాటకి జవాబు చెప్పకుండా, ఇల్లంతా కలయచూస్తూ అడిగింది.

"మీ ఆయనేడి?"

"మా ఆయనా?" తెల్లబోయింది రమ్య.

వెంటనే అర్థమైనట్లు నవ్వేసి–

"నిన్ననే వచ్చి వెళ్ళాడమ్మా, మళ్ళీ శనివారం వస్తాడు" అంది.

రమాకాంత్ సీరియస్‌గా చూశాడు కూతురి మొహంలోకి.

"నిన్న వచ్చి వెళ్లడం ఏవిటి? శనివారం రావడం ఏవిటి? క్యాంప్ కెళ్ళాడా? ఈ ఊళ్లో ఉండడా?"

రమ్య ఓ క్షణం సమాధానం చెప్పలేదు. వచ్చీరాగానే వాళ్ళ మనసు పాడు చేయడం ఇష్టంలేకపోయింది. వాళ్ళకర్థంకాని, అనుభవంలోకి రాని ఈ అనుబంధం గురించి ఇప్పుడు చెప్పి కన్విన్స్ చేయడం కష్టం. అందుకే నవ్వుతూ,

"ముందు మీ ఇద్దరూ బ్రెష్ చేసుకోండి, కాఫీ ఇస్తాను. మంచి ఫిల్టర్ కాఫీ" అంది.

"అదికాదే…" ఏదో అడగబోతోన్న భార్యని వారించి, రమాకాంత్ బ్రెష్ చేసుకోడానికి వాష్‌బేసిన్ దగ్గరికి నడిచాడు. వాళ్లిద్దరూ మొహం కడుక్కుని రాగానే రమ్య కమ్మటి కాఫీ ఇచ్చింది.

కాఫీ తాగుతూ అడిగింది భువనేశ్వరి.

"ఈ ఇంటికి అద్దెంత? ఇరుగుపొరుగు అవసరం వస్తే సాయం చేస్తారా?"

రమ్య నవ్వుతూ, "ఇరుగుపొరుగు అవసరం వస్తే సాయం చేయడానికి రారమ్మా, అవసరం లేకపోయినా కామెంట్స్ చేయడానికి వస్తారు" అంది.

"కామెంట్స్ చేసే అవకాశం మనం ఇస్తే ఎందుకు చేయరు?" రమాకాంత్ అన్నాడు.

రమ్య చురుగ్గా చూసి ఊర్కుంది.

"ఇంతకీ ఏడే ఇతను…" మళ్ళీ అడిగింది భువనేశ్వరి.

"అతనిక్కడ ఉండడమ్మా... సురేష్ ఇల్లు వేరే ఉంది. భార్యాపిల్లలతో ఉంటాడు."

"మరి నువ్వు అతనితో బతుకుతున్నానన్నావేం" ఆవిడ అయోమయంగా చూసింది.

"అవునమ్మా..."

"అంటే? అతనికి ఉంపుడుగత్తెగా బతుకుతున్నావా?" తీవ్రంగా అన్నాడు రమాకాంత్.

"నాన్నా!" సీరియస్‌గా పిల్చింది.

"అలాంటి మోటు పదాలు ఉపయోగించకు నాన్నా, సురేష్ నా ఫ్రెండ్. నేనతనికి ఫ్రెండ్‌ని. ఒకరికొకరు నచ్చాం. ప్రేమానురాగాలు పెంచుకున్నాం. కలిసి బతుకుతూ అవి ఒకరికొకరం పంచుకుంటున్నాం"

"అంటే? పెళ్లికాకుండానా కలసి బతికేది?"

"కలిసి బతకాలంటే పందిట్లో బాజాభజంత్రీల మధ్య మంత్రాల సాక్షిగా, వేలమందికి భోజనాలు పెట్టి, పెళ్ళి చేసుకొని కొంగులు ముడేసుకుని బతకడమా? నా ఉద్దేశ్యంలో అది బానిసత్వం. భర్తగా అతను నామీద అధికారాలు చెలాయించడం, భార్యనంటూ అతని సంపాదన మీదా, వ్యక్తిత్వం మీదా హక్కులు ప్రదర్శించడం... ఇదా జీవితం"

"నోర్ముయ్యవే! ఆపు నీ వితండవాదం. ఎమ్మే చదివి ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన నువ్వు చాలా గొప్పదానివయ్యావా? ఏదో ఉద్యోగం చేసుకుంటూ, గౌరవంగా బతుకుతావని, ఒక్కదాన్ని ఈ ఊరు పంపించాం. అంతేగానీ, ఇలాంటి నీచమైన పనిచేసి మా పరువు తీస్తావనుకోలేదు. ఛీ, నీకేం ఖర్మే, లక్షణంగా పెళ్లి చేసుకోక ఈ ఉంపుడుగత్తె బతుకేంటి?" మండిపడింది భువనేశ్వరి.

"అమ్మా! పెళ్లి చేసుకుని కాపురాలు చేస్తున్న వాళ్లెంతమంది నిజంగా ఒకళ్లమీద ఒకళ్ళు ఇష్టంతో బతుకుతున్నారు? అయినా లక్షలు ఖర్చుపెట్టి పెళ్ళి చేసుకున్నవాళ్ళు విడిపోవడం లేదా? మొక్కుబడికి మొగుడితో కాపురం చేస్తూ, పిల్లల్ని కంటూ ఛీ... ఛీ... నాకలాంటి జీవితం ఇష్టంలేదు. రసానుభూతిలేని బతుకు నాకొద్దు"

"రసానుభూతా! నీ బొందా! ఇదేం కథల్లో జీవితమా? ఉంచుకున్న దానివని అందరూ నీ మొహాన ఉమ్మేస్తారు. అయినా తోటి ఆడదాని మొగుణ్ణి

వల్లో వేసుకోడానికి, ఆ పిల్ల ఉసురు పోసుకోడానికి నీకు సిగ్గులేదూ" చీదరింపుగా అంది.

"ఎందుకు సిగ్గు! ఆ అమ్మాయికి నేనేం అన్యాయం చేశాను? అతని సంపాదన అడిగానా? అతని ఆస్తిపాస్తుల్లో భాగం అడిగానా? అతణ్ణి నా ఇంట్లో కట్టేసి ఆవిడ దగ్గరకి పంపలేదా? అతని పిల్లల్ని వదిలేయమన్నానా? నేనేం చేశాను? వారానికోసారి వస్తాడు. నా దగ్గరికి రెండు రాత్రులు మాత్రం ఉంటాడు. శనివారం వచ్చి సోమవారం ఉదయం అక్కడికే వెడతాడు. ఉన్న ఆ కొన్ని గంటలే అపురూపంగా గడుపుతాం. మామధ్య దాపరికాలు, అనుమానాలు లేవు. మనసా, వాచా ఒకరికొకరుగా బతుకుతున్నాం."

రమాకాంత్ మెల్లిగా నోరు విప్పాడు.

"నీ చుట్టూ ఉన్నవాళ్లు అతనెవరని అడిగితే ఏంచెప్తావు?"

"అసలెందుకు చెప్పాలి? అతనెవరో తెలుసుకోవాల్సిన అవసరం వాళ్ల కెందుకు?"

"అంటే నీకంటూ ఓ భద్రతగల జీవితం, నీ చుట్టూ గౌరవనీయమైన వాతావరణం లేకుండా తెగిన గాలిపటంలా బతుకుతావా?"

"తెగిన గాలిపటం ఎలా అవుతాను నాన్నా? నా జీవితానికి భద్రత లేదని ఎవరన్నారు? వీలైనంత త్వరలో ఓ స్వంత ఇల్లు కొనుక్కుంటాను. గవర్నమెంట్ ఉద్యోగం ఉంది. ఇంకా ఏంకావాలి?" రమ్య నచ్చచెబ్తున్నట్టుగా అంది.

రమాకాంత్ నవ్వాడు.

"ఇంకా ఏంకావాలో, నేనిప్పుడు చెప్పినా నీకర్థంకాదు. కాలం గడిచినకొద్దీ నువ్వు ఏం కోల్పోయావో! నీకేం కావాలో నీకే తెలుస్తుంది. అప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నీకంటూ ఏమీ మిగలదు"

"ఎందుకు నాన్నా! ఏదేదో ఊహించి నన్ను భయపెడ్తారు. నాకు నచ్చిన విధంగా బతికే హక్కు నాకు లేదా? సురేష్ చాలా మంచివాడు. అతని వలన నాకేం అపకారం జరగదు. సాయంత్రం రమ్మంటాను. మీరే చూడండి" అనున యంగా అంది రమ్య.

"సరే రమ్మను, నీకంతగా నచ్చిన ఆ వ్యక్తి ఎవరో నాకూ చూడాలని ఉంది. కానీ ఓ విషయం గుర్తుంచుకో అతణ్ణి మాత్రం ఎప్పుడూ మా ఇంటికి తీసుకు రాకు" ఖచ్చితంగా అన్నాడు.

"ఏం?" కొంచెం విస్మయం, బాధ కలగలిపిన స్వరంతో అడిగింది.

"అతనెవరని నా చుట్టూ ఉన్నవాళ్లు అడుగుతారు. ఏంచెప్పాలో తెలీక నేను తెల్లమొహం వేస్తాను. మా అమ్మాయి ఉంచుకుందని చెప్పలేను. ఎందుకంటే నీకున్నంత ధైర్యం నాకు లేదు. నేను సంఘజీవిని. కనీసం నీ మెళ్ళో తాళిబొట్టన్నా ఉండి ఉంటే అతనికి రెండో భార్యవని సమాధానపడేవాణ్ణి."

"తాళికంత విలువుందా నాన్నా మీ దృష్టిలో. నేను తాళిని ఓ ఆర్నమెంట్‌గా భావిస్తాను.  అది వేసుకోవడం తప్పనిసరి అయితే ఇవాళే తెచ్చుకుని వేసు కుంటాను."

"నోర్మయ్యవే పాపిష్టిదానా! పవిత్రమైన మాంగల్యం గురించి అట్లా మాట్లాడడానికి నీకు నోరెలా వస్తోంది?" గయ్యిమంది భువనేశ్వరి.

రమ్య అదోలా చూసింది, తల్లివైపు. రూపాయి నాణెం అంత తాళిబొట్లు ఆవిడ గుండెలమీద వేళ్ళాడుతున్నాయి. నుదుట పెద్ద కుంకుమబొట్టు, నల్లపూసలు.

"హు, పవిత్రత! దేనికమ్మా పవిత్రత? ఈ దేశంలో నగలకీ, వస్తువులకీ పవిత్రత ఆపాదిస్తారు. కానీ మనుషులకే అదిలేదు. పవిత్రత అనేది మనసుకి సంబంధించింది. తాళిబొట్టుని పసుపుకుంకుమలతో పూజిస్తారు కాబట్టి, దానికో పవిత్రత ఆపాదించబడింది. అలాంటివేగా ఈ నగలు. ఈ ఉంగరం, దుద్దులు కూడా. పసుపు కుంకుమలతో పూజించి, సురేష్ చేత్తో తొడిగించుకోనా?"

"తల్లీ! నీకూ, నీ పెద్దలకీ నమస్కారం. నీ అంతగా నేను చదువుకోలేదు. మా అమ్మానాన్నా నాకు ఒకటే నేర్పారు. నీలా బరితెగించడం నేర్పలేదు. నీ ప్రశ్నలకి నేను సమాధానం చెప్పలేను. ఏవండీ! లేవండి వెళ్ళిపోదాం. ఇంక ఒక్క క్షణం కూడా నేనిక్కడ ఉండలేను" విసురుగా లేచింది భువనేశ్వరి.

రమాకాంత్ ఆవిడ చేయి పట్టుకుని కూర్చోబెడుతూ అన్నాడు, "ఆవేశ పడకు భువనా! సాయంత్రం నీ అల్లుడుకాని అల్లుణ్ణి చూసి వెళ్దాం, ఓపిక పట్టు"

"ఛీ" చీదరించుకుందావిడ.

రమ్య మనసు చివుక్కుమంది ఆవిడ చీదరింపుకి.

తనకి నచ్చిన జీవన విధానాన్ని అనుసరించే హక్కు తనకి లేదా? తనకేది ఆనందాన్ని, సుఖాన్ని ఇస్తుందో అలా భవిష్యత్తు నిర్మించుకుంది. అందువలన వీళ్ళు పొందే నష్టం ఏమిటి? ఎందుకు అమ్మ తనని అసహ్యించుకుంటోంది. రోబోట్‌ల యుగంలో కూడా ఆడపిల్లల జీవితం తల్లిదండ్రుల నిర్ణయాల మీద

ఆధారపడి వుండాల్సిందేనా! ఎంతవరకు సమంజసం! ఏవిధంగా న్యాయం.

రమ్య మనసులో అనేక సందేహాలు ఒక్కసారిగా ముప్పిరిగొన్నాయి. "నేను వంటచేసి, ఆఫీస్‌కెళ్ళి వస్తాను. మీరు భోంచేసి రెస్ట్ తీసుకోండి" అంది మంచం మీంచి లేస్తూ.

"నీచేత్తో వండిన వంట నేను తినను" కోపంగా అన్నది భువనేశ్వరి.

"పోనీ, నువ్వే వండు నీచేతి వంట తిని చాలా రోజులైంది" అల్లరిగా అన్నది రమ్య.

"అవసరంలేదు. నీ ఇంట్లో మెతుకు కూడా ముట్టుకోను"

రమాకాంత్ రమ్య మొహం చూశాడు. రమ్య కళ్ళల్లో బాధ రెపరెపలాడు తోంది. భువనేశ్వరి కఠినమైన మాటలకి ఆమె మనసు గాయం అయిందని తెలుస్తోంది. అందుకే భార్యనుద్దేశించి అన్నాడు, "భువనా! లే... లేచి వంటచేయి."

భువనేశ్వరి అయిష్టంగా లేచి, స్నానానికి బాత్రూంవైపు వెళ్ళింది. ఆవిడ స్నానం చేస్తేగానీ వంట జోలికి వెళ్లదు. రమ్య ఇల్లు సర్దుకోడం, కూరలు తరగడం వగైరా పనుల్లో పడిపోయింది.

రమ్య ఆఫీస్‌కి వెళ్తూనే ముందు సురేష్‌కి ఫోన్‌చేసి సాయంత్రం రమ్మంది.

సాయంత్రం ఐదున్నరకి కూతురుతో కలిసి వచ్చిన సురేష్‌ని చూసి మొహం చిట్లించుకుంది భువనేశ్వరి.

రమాకాంత్ పొడిపొడిగా మాట్లాడాడు. సురేష్ కూడా ముళ్లమీద కూర్చు న్నట్టుగా ఇబ్బందిగా ఓ అరగంట కూర్చుని వెళ్లిపోయాడు. రమ్యతో కూడా ఓ పరిచయస్థురాలితో మాట్లాడినట్టు ఒకటి, రెండు మాటలు మాట్లాడి వెళ్లిపోయాడు.

రమ్యకి చిత్రంగా అన్పించింది అతని ప్రవర్తన. ఇంట్లో మనిషిలాకాక పరాయి వాడిలా అతను ప్రవర్తించింది ఎందుకో అర్థంకాలేదు. బహుశా అమ్మా, నాన్నల్ని చూసి మొహమాటపడి ఉంటాడు అనుకుంది.

"మీ ఇద్దరి మధ్యా ఎంతో అన్యోన్యత ఉందన్నావు, ఇంతేనా!" కొంచెం హేళనగా అడిగాడు రమాకాంత్.

"మీరు కొత్త. పైగా మీరూ అలాగే ప్రవర్తించారుగా" ఉక్రోషంగా అంది.

"అందంగా ఉన్నాడని నీవైపు తిప్పుకున్నావా?" ఈసడించింది భువనేశ్వరి.

"అంత అసహ్యంగా మాట్లాడకమ్మా, ఇతనికన్నా అందమైన ఫ్రెండ్స్

చాలామంది ఉన్నారు. అందరితో ఇలాంటి అనుబంధం పెంచుకున్నానా? నాకీ జీవితం నచ్చిందంటే అర్థం చేసుకోరేం" కోపంగా అంది.

రమాకాంత్ నిట్టూర్చి స్థిరంగా అన్నాడు– "సరే! నీకు నచ్చింది కాబట్టి నువ్విలాగే బతుకు. ఈమధ్యలో ఎప్పుడే సమస్య వచ్చినా నన్ను సంప్రదించద్దు. నా సలహా అడగొద్దు. నీ జీవితానికి సంబంధించిన మంచిచెడులన్నిటికీ నువ్వే బాధ్యురాలివి."

"సరే నాన్నా, నాకే సమస్యా రాదు. హక్కులు, అధికారాల కోసం, ఆరాటం ఉంటే దెబ్బలాటలు వస్తాయి. మామధ్య గిల్లికజ్జాలు తప్ప, దెబ్బలాటల ప్రసక్తి రాదు. ఇంక సమస్యేం ఉంది."

నవ్వాడు రమాకాంత్. "ఓకే, గుడ్‌లక్" అన్నాడు లేస్తూ. భువనేశ్వరి సూట్‌కేస్ తీసుకుంది.

"వెళ్ళిపోతున్నారా?" అడిగింది రమ్య.

"ఉండి చేసేదేం ఉంది!" నిర్లిప్తంగా అన్నారిద్దరూ.

"సరే, మీ ఇష్టం" రమ్యకి బాధగా అన్పించినా గుండె దిటవు చేసుకుని వాళ్లని రైలెక్కించి వచ్చింది.

వస్తూవస్తూ దారిలో పబ్లిక్ ఫోన్ బూత్ నుంచి సురేష్ ఇంటికి ఫోన్ చేసింది. సురేష్ రిసీవ్ చేసుకున్నాడు. రమ్య మండిపడుతూ అంది, "నీకసలు బుద్ధుందా? ఎవరో పరాయి వాళ్ళు విజిట్ చేసినట్టు వచ్చి వెళ్తావా? అసలే వాళ్లకి లక్ష అనుమానాలు. నీ ప్రవర్తనతో మనిద్దరి మధ్యా ఉన్న అనుబంధం వాళ్ళు అసలు అర్థం చేసుకోలేదు. నేను నీదాన్ని, ఆ ఇల్లు నీది అన్న ఆలోచనే లేనట్టుందే"

"రమ్యా" విసుగ్గా పిలిచాడు సురేష్.

స్వరం తగ్గించి, "ఈ విషయం మాట్లాడడానికి ఇదేనా సమయం? ఇంట్లో అంతా ఉన్నారు. పెళ్లాం పిల్లలున్నవాణ్ణి నీతో చనువుగా ప్రవర్తిస్తే వాళ్లేం అనుకుంటారు" అన్నాడు. రమ్యకి ఒళ్ళు మండింది. "అవన్నీ నేనాలోచించాలి. నువ్వుకాదు, నేను చెప్పలేదా వాళ్ళకీ విషయం? అయినా..." ఫోన్ పెట్టేసింది.

అంటే తను మంచివాడనిపించుకోవాలని అలా ప్రవర్తించాడా? తను చెడ్డది కావాలా? సురేష్ ధోరణి నచ్చలేదామెకి. ఒక నిర్ణయం తీసుకున్న తరువాత మంచైనా, చెడైనా ధైర్యంగా దానికి కట్టుబడాలి. ఎదుర్కోవాలి. కానీ ఇదేమిటి?

మనసు చికాగ్గా అయిపోయింది. చాలాసేపు ఒక్కతే ట్యాంక్‌బండ్ మీద కూర్చుని తరువాత ఫ్లాట్‌కి వెళ్ళిపోయింది.

మర్నాడు సురేష్ ఆఫీస్‌కెళ్ళి చెడామడా దులిపేసింది. "అర్థంచేసుకో రమ్యా! మన అనుబంధం అందరికీ తెలియాల్సిన అవసరం ఏమిటి? అందరి ఎదురుగా నీ మనిషిలా ఎలా ప్రవర్తిస్తాను?" నచ్చచెప్తున్నట్టుగా అన్నాడు సురేష్.

"నా మనిషిలా ప్రవర్తించడం అంటే మీద పడటమా? కొంచెం ఫ్రీగా మాట్లాడవచ్చుగా. అలా అంటీ ముట్టనట్టు మాట్లాడితే వాళ్ళేం అనుకుంటారు. పైగా వాళ్ళెవరో కాదు, మా అమ్మానాన్నా"

"రమ్యా, కొన్ని విషయాలు నాకిష్టం ఉండదు. అలాంటి వాటిల్లో నన్ను ఇబ్బంది పెట్టకు... ప్లీజ్"

విసురుగా వచ్చేసింది.

సురేష్‌కి తనతో సంబంధం రహస్యంగా కొనసాగాలని ఉందా? కానీ తనకలా ఇష్టంలేదు.

దొంగతనం చేసినట్టు ఎందుకలా? తనేం తప్పుచేస్తోందని! ఎంత ఆలోచించినా అర్థంకాలేదు రమ్యకి.

ఆరోజు, మర్నాడు కూడా చాలా చిరాగ్గా అన్పించింది. ఒక్కదానికి బోర్ అన్పించింది. చలం 'ప్రేమలేఖలు' చదివింది. చాలా ఎక్కువసార్లు చదవడం చేతనేమో బోర్ అనిపించింది. తలుపు తీసుకుని బైటికి వచ్చింది.

పక్క ఫ్లాట్స్‌లోని ఇద్దరు యువతులు కబుర్లు చెప్పుకుంటున్నారు. రమ్య వాళ్లని చూసి, పలకరింపుగా నవ్వింది.

వాళ్ళు నవ్వుతూ పలకరించారు.

"భోజనమైందా?"

"అయిందండీ" నవ్వుతూ చెప్పింది రమ్య.

"మీ ఇంటికి చుట్టాలొచ్చినట్టున్నారు" ఒక యువతి అడిగింది.

"మా అమ్మా, నాన్నా వచ్చారండీ, వెళ్ళిపోయారు"

"అప్పుడేనా?"

కొంచెం ఇబ్బందిగా అంది, "అవును, మా కజిన్ పెళ్ళి. పెళ్ళికి వచ్చారు."

"మరి మీరు వెళ్ళలేదేం"

"ఊరికినే"

"మీ వారు లేనట్టున్నారు" అసలు విషయానికొస్తున్నారు. ఇంక సంభాషణ పెంచడం అనవసరం.

రమ్య ఆవలిస్తూ అంది, "బాగా అలసిపోయాను... నిద్రొస్తోంది, గుడ్‌నైట్" లోపలికి వెళ్ళి తలుపేసుకుంది.

***

శనివారం సురేష్ ఆఫీస్ దగ్గరికి వచ్చాడు.

రమ్య అతని వెనకాల స్కూటర్ ఎక్కి కూర్చుంటూ అంది.

"ఇవాళ సినిమాకెళ్దామా?"

"సారీ రమ్యా! ఇవాళ నిధి పుట్టినరోజు. నిన్ను ఇంటిదగ్గర దింపేసి కాస్సేపు కూర్చుని వెళ్దామని వచ్చాను"

నిధి సురేష్ పెద్దకూతురు.

రమ్య కొంచెం హుషారుగా అంది, "అరే! ఆ విషయం ముందు చెప్ప వచ్చుగా, మంచి గిఫ్ట్ కొందాం. నేనూ వస్తాను మీ ఇంటికి"

"నువ్వా! వద్దొద్దు" ఖంగారుగా అన్నాడు.

అతనన్న తీరుకి రమ్య మనస్సు చివుక్కుమంది.

"ఏం సురేష్! నేను రాకూడదా! అందరం కలుసుకుంటూ ఉండవచ్చుగా."

సురేష్‌కేం చెప్పాలో తోచలేదు. ఇప్పుడు రమ్యని ఇంటికి తీసికెళితే ఏమన్నా ఉందా? శోభ ఇల్లు పీకి పందిరేస్తుంది. నోరు కాస్త దురుసు. రమ్యనేమన్నా అంటే తను బాధపడుతుంది.

"ఏం అనుకోకు రమ్యా! ఇంకోరోజు నేనే తీసికెళ్తాను మా ఇంటికి."

స్కూటర్ అపార్ట్‌మెంట్ ముందు ఆగింది.

రమ్య నిశ్శబ్దంగా వెళ్ళి స్నానంచేసి వచ్చి పాలు, పంచదార, టీ పొడి కలిపి కెటిల్ స్టవ్ మీద పెట్టింది.

సురేష్ వెనగ్గా వచ్చి ఆమెని చుట్టేసి కాస్సేపు ఊపిరి సలపనివ్వలేదు.

రమ్య విసురుగా విడిపించుకుని సీరియస్‌గా అంది, "సురేష్! మన అగ్రిమెంట్ ప్రకారం ఇవాళ నాదగ్గర ఉండాల్సిన రోజు. కానీ, నీ కూతురు

పుట్టిన రోజు అన్నావుకదా! అని నిన్ను వదిలేస్తున్నాను. అరగంటకోసం, గంటకోసం వచ్చి ఇలాంటి కక్కుర్తి పనులు చేయద్దు. నాకిష్టంలేదు. ఇలాంటి మొక్కుబడి పనులు నాకు నచ్చవు."

"సరే, తల్లీ! ముట్టుకోను. తప్పైపోయింది" చెంపలేసుకుని కిచెన్ ప్లాట్‌పామ్ ఎక్కి కూర్చున్నాడు.

టీ కప్పు అందిస్తూ, నిదానంగా అతణ్ణి చూస్తూ అడిగింది.

"నిజం చెప్పు మన విషయం మీ ఆవిడకు చెప్పలేదు కదూ!"

"లేదు, చెప్తే ఏడుపులు, గొడవలు ఎలా చెప్పను?"

"మన సంగతి తెలిసినవాళ్ళు ఎవరన్నా చెప్తే ఏం చేస్తావు? అంతకన్నా నువ్వే చెప్పచ్చుకదా! అలా చెప్తే మనం అందరం ఒకటిగా కలిసిపోవచ్చుగా"

సురేష్ రమ్యని వింతగా చూశాడు. "అదెలా సంభవం రమ్యా! మన అనుబంధం కాన్ఫిడెన్షియల్ కదా!"

"ఎందుకవుతుంది? మనం బాహాటంగా తిరుగుతున్నాం"

"కావచ్చు. తిరిగినంత మాత్రాన నీతో కలిసి నేను బతుకుతున్నట్టు ఆధారం ఏం ఉంది?"

"అంటే!"

"చూడు రమ్యా! మనిద్దరి అనుబంధం తీయనిది, అపూర్వమైనది. ఇది అందరికీ తెలిసి చులకన అవడం నాకిష్టంలేదు. వివాహేతర సంబంధాలని పవిత్రంగా చూసేంత హృదయ వైశాల్యం మనవాళ్ళకింకా ఏర్పడలేదు. అక్రమ సంబంధం అనీ, ఉంచుకోవడం అనీ పేర్లు పెడతారు"

సురేష్ మాటలు నిజమే అన్పించినా ఎందుకనో ఆ సంబంధం సీక్రెట్‌గా ఉంచాల్సిన అవసరం లేదనిపిస్తోంది రమ్యకి. అవసరాన్నిబట్టి అందరికీ చెప్పచ్చు కదా! మామూలుగా అందరిలా బతకచ్చు కదా!

సురేష్ లేచి రమ్య దగ్గరగా వచ్చి దగ్గరకు తీసుకొని లాలనగా అన్నాడు, "పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు. రేపు వస్తాగా లెటజ్ ఎంజాయ్, మరి వెళ్ళనా? నిధి ఎదురుచూస్తుంటుంది."

రమ్య నవ్వింది. "ఓ.కె. వెళ్ళు. నా విషెస్ అందచేయి."

"ఓ ష్యూర్" సురేష్ హుషారుగా వెళ్ళిపోయాడు.

కిటికీలోంచి వెళ్ళిపోతున్న అతణ్ణి చూస్తోంటే ఆమెకి ఎలాగో అన్పించింది.

మనసంతా బ్లాంక్‌గా తన వస్తువునెవరో తననుంచి లాక్కెళ్ళిపోతోన్నట్టు, తననెవరో సమాజం నుంచి బహిష్కరించి, రిమోట్ ప్లేస్‌కి విసిరేసినట్టు.

ఓసారి గాఢంగా నిట్టూర్చి ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది.

***

రమ్యకి జీవితం హాయిగా గడుస్తోంది.

సురేష్ శుక్రవారం సాయంత్రం ఆఫీసు నుంచి రమ్యని పికప్ చేసుకుని, సోమవారం దాకా ఆమెతో గడిపేసి, సోమవారం ఉదయం ఇంటికెళ్ళిపోతాడు. ఈమధ్యలో ఎప్పుడైనా ఓసారి చూడాలనిపిస్తే ఇద్దరూ కలుసుకుని ఓ గంటసేపు కబుర్లు చెప్పుకుంటారు. ఈవిధమైన రొటీన్ బాగానే ఉందనిపిస్తోంది.

హడావుడి పడుతూ నిద్రలేవడం, వండడం, క్యారేజీలు సర్దడం, అలకలు, కోపాలూ ఇలాంటివేం లేవు. అత్తగారి ఆరళ్ళు, మావగారి సేవలు బోర్.

రమ్య ఐదున్నరకి లేచి ఓ అరగంటసేపు వాక్‌కి వెళుతుంది. తరువాత ఫ్లాట్ కొచ్చి గదులు శుభ్రం చేసుకొని వంట కానిస్తుంది. ఎనిమిదిన్నరకి నింపాదిగా తయారై ఆఫీస్‌కెళ్ళిపోతుంది.

సాయంత్రం పూట ఆఫీస్ నుంచి ఏదో మీటింగ్‌కో, కల్చరల్ ప్రోగ్రామ్‌కో వెళ్ళి ఏడున్నర, ఎనిమిదింటికి ఫ్లాట్‌కి వస్తుంది. మూడ్ బాగుంటే సింపుల్‌గా కూర,చారు చేసుకుని రాత్రి భోజనం చేస్తుంది. లేకపోతే బ్రెడ్ తినేస్తుంది! ఓ గంట చదువుకుని ఆ తరవాత నిద్రపోతుంది. ఈమధ్యే వాషింగ్ మెషిన్ కొంది. మూడు రోజులకోసారి బట్టలు వాషింగ్ మిషన్‌లో వేస్తుంది.

***

ఆరోజు రమ్య ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి అంతా సందడిగా ఉంది. చాలామంది పిల్లలు, పెద్దలు అందంగా ముస్తాబై కళకళ్ళాడుతూ కన్పించారు. ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లో టేప్‌రికార్డర్ వెస్ట్రన్ మ్యూజిక్ విన్పిస్తోంది. పిల్లలు కొందరు మ్యూజిక్‌కి అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్నారు. మొత్తం ఫ్లాట్స్‌లోని వాళ్ళంతా అక్కడే ఉన్నారు.

రమ్యకి సరదాగా అనిపించింది. ఎప్పుడు చూసినా ఎవరిళ్లలో వాళ్ళు తలుపులు బిడాయించుకుని ఉంటారు. నిశ్శబ్దంగా ఉండే ఫ్లాట్స్ అన్నీ సందడిగా ఉన్నాయి.

ఓ చిన్న పాపని పిలిచి అడిగింది. "ఏమిటి విశేషం? మీరంతా చక్కగా

తయారయ్యారు?"

"ఇవాళ పింకీ బర్త్‌డే పార్టీ" తుర్రుమని వెళ్ళిపోయింది.

"పింకీ" అంటే ఎదుటి ఫ్లాట్స్ వాళ్ళ పాప. రమ్య లోపలికెళ్ళిపోయింది.

"ఇదేమిటి? పార్టీ చేస్తూ తనని ఆహ్వానించలేదేం! మొత్తం ఫ్లాట్స్ వాళ్ళందర్నీ పిలిచి తనని వెలేశారా? ఏమోలే! తను ఉదయం నుంచీ లేదు కదా! ఇప్పుడు ఎవరన్నా వచ్చి పిలవచ్చు. పింకీకి మంచి గిఫ్ట్ ఇవ్వాలి. రమ్య ఆమధ్య తను కొన్న కోతిబొమ్మ తీసింది. నల్లటి బొచ్చు మెరుస్తూ పెద్ద తోకతో ఉందది! ముద్దొస్తోంది. పింకీ కళ్లల్లో వెలిగే సంతోషం ఊహించి నవ్వుకుంది. బొమ్మ పక్కనపెట్టి, స్నానానికెళ్ళింది. అరగంటలో చక్కగా ముస్తాబై, టీ తాగుతూ కూర్చుంది. రమ్య తనని ఎవరో ఆహ్వానిస్తారని ఎదురు చూస్తుండగానే పదైంది.

చాలా బాధనిపించింది. తనేం చేసిందని. వీళ్ళు తననెందుకు అలా విడిగా చూస్తున్నారు? తనేం తప్పుచేసిందని? వాళ్ళ ఆనందంలో పాలు పంచుకునే అర్హత లేదా?

ఓ గ్లాసుడు వేడి పాలు తాగి పడుకుంది. చదువుకోవాలనిపించలేదు. ట్రాన్సిస్టర్ ఆన్ చేసింది. వివిధభారతిలో పాత హిందీ పాటలు వినడం ఆమెకెంతో ఇష్టం. రఫీ కంఠంలోని మృదుగంభీరత, లత కంఠంలోని తీయదనం గుండెల్ని స్పృశిస్తూ, మనసు పొరల్లో అలజడి సృష్టిస్తూ... సురేష్ పక్కన ఉంటే బాగుండేది! ఈ రాత్రి ఫ్లాట్స్ వాళ్ళు కలిగించిన బాధా, పాటల తాలూకు మధురానుభూతి, అతనితో కలిసి పంచుకుంటే! వెంటనే టెలిఫోన్ కనెక్షన్‌కి అప్లై చేయాలి. కనీసం ఇంట్లో ఫోన్ ఉంటే సురేష్‌తో కాస్సేపు కబుర్లు చెప్పుకోవచ్చు.

చాలాసేపు అల్లరి చేసిన నిద్రాదేవి ఎప్పటికో కరుణించింది.

***

"సురేష్! నిన్న మన ఫ్లాట్‌వాళ్ళు పార్టీ చేసుకుని నన్ను పిలవలేదు తెలుసా!"

టీ కప్పు అందిస్తూ చెప్పింది రమ్య.

సురేష్ మాట్లాడలేదు. కొంచెంసేపాగి అన్నాడు. "పోనీలే రమ్యా! నష్టం ఏముంది?"

"నష్టమేంలేదనుకో కానీ, అందరూ అలా సరదాగా ఉంటే నాకూ వాళ్ళ ఆనందంలో భాగం పంచుకోవాలనిపించింది. సెకండ్ ఫ్లోర్‌లో ఉంటున్న చరిత చెప్పింది. నేను నిన్ను ఉంచుకున్నానట. అందుకే నన్నెవరూ పిలవలేదుట. చిన్నపిల్ల

లతో కూడా చెప్తున్నారట, నేను మంచిదాన్ని కానని."

"అవన్నీ వినకు! వదిలెయ్"

"వదిలేస్తాను కానీ అప్పుడప్పుడు బాధనిపిస్తుంది. అసలు ఉంచుకోవడం ఏమిటి? మా అమ్మ కూడా అలాగే అంది. నాకసలు ఆ పదం వింటేనే కంపరంగా అనిపిస్తుంది."

సురేష్ టీ తాగడం ముగించి, కప్పు కిందపెట్టి రమ్య చేయి తన చేతిలోకి తీసుకుని "ఇవన్నీ మామూలే రమ్యా! వివాహం కాకుండా పరాయి పురుషుడితో సంబంధం పెట్టుకున్న స్త్రీని మన సమాజం చాలా చులకనగా చూస్తుంది. చెడిపోయిందానిగా భావిస్తుంది."

"మరి అదే స్త్రీతో సంబంధం ఉన్న పురుషుణ్ణి గౌరవిస్తుందిగా"

"అదేగా విశేషం! తరతరాలుగా మన సమాజంలో స్త్రీకి కొన్ని నిర్దిష్టమైన నిబంధనలు, కట్టుబాట్లు ఉన్నాయి. అవి తెంచుకున్న ప్రతి స్త్రీ నీలా కత్తిమీద సాము చేయాల్సిందే"

"ఎంత సంస్కారం లేని ఆలోచనలు! ఎవరి జీవితం వారిదైనప్పుడు, ఎవరిష్టమైనట్టు వాళ్ళు ఎందుకు బతక్కూడదు? పెళ్ళైన వాళ్ళంతా పతివ్రతలు, కానివాళ్ళు చెడిపోయిన వాళ్ళా! అయినా ప్రేమానురాగాలతో ముడేసుకోవాల్సిన జీవితాన్ని తాళిబొట్టుతో బంధించడం ఏమిటి? ఏమో! ఎవరేమన్నా అనుకోనీ, నాకు ఈ జీవితమే బాగుంది. నా ఈ బిజీ లైఫ్‌లో ఇంతకన్నా బాధ్యత నేను మోయలేను" సురేష్ ఒళ్ళో తలపెట్టుకుని పడుకుంది రమ్య.

"గుడ్! ఈమాత్రం ఆత్మస్థైర్యం ఉండాలి" ముంగురులు సవరిస్తూ అన్నాడు.

***

ఆరోజు దీపావళి–

ఊరికెళ్ళి తల్లిదండ్రులతో గడపాలని ఎంతో అనిపించింది రమ్యకి. కానీ, సురేష్‌ని తీసుకురావద్దన్న తండ్రి దగ్గరికి తను మాత్రం ఎందుకెళ్ళాలి? కనీసం పండక్కి రామ్మా అని వాళ్ళు కూడా ఉత్తరం రాయలేదు. కనీసం తమ్ముడైనా రాయచ్చుగా, వాడికేమైంది? తను వాళ్ళు తెచ్చిన సంబంధం ఒప్పుకుని, మెడవంచి తాళి కట్టించుకుని, శాస్త్రోక్తంగా అత్తగారింటికి వెళ్ళి ఉంటే ప్రతి పండక్కి ఆహ్వానించి బట్టలు పెట్టేవాళ్ళేమో! సాయంకాలం చీకటిపడ్డాక కాండిల్స్ వెలిగించి, బాల్కనీ గోడమీద అందంగా పేర్చింది. కొత్తచీర కట్టుకుంది. సురేష్ ముందే

చెప్పేశాడు. ఆరోజు కలవనని. ఇంట్లోవాళ్ళు అతను లేకపోతే గోల చేస్తారట. తనని వాళ్ళింటికి ఆహ్వానించవచ్చుగా? వాళ్ళ కుటుంబ సభ్యుల్లో తననీ ఒకదానిగా భావించవచ్చుగా, పెళ్ళికానంత మాత్రాన తను అతని భార్య కాదా!

రమ్య ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తనేమిటి ఇలా ఆలోచిస్తోంది? తామిద్దరి మధ్యా భార్యాభర్తల సంబంధం, బరువు బాధ్యతలు ఉండకూడదన్న కండిషన్ పెట్టింది తనేగా! తల విదిల్చింది.

బైట చిచ్చుబుడ్లు వెలుగుతున్నాయి. పిల్లలంతా హుషారుగా చప్పట్లు కొడుతున్నారు. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ నవ్వులూ,కేరింతలూ, చెవులు చిల్లులు పడేలా బాంబుల మోత.

చాలాసేపు బాల్కనీలోనే నిలబడి ఆ సంబరం చూసి మెల్లిగా లోపలికొచ్చే సింది. కొద్దిగా అన్నం తిని చీర మార్చుకుని, లైటార్పి మంచం మీద వాలి పోయింది.

పన్నెండైనా నిద్రపట్టలేదు.

చిన్నప్పుడు "ఆడపిల్లవు, నీకు బాంబులెందుకే" అంటే వినకుండా తమ్ముడి వాటా కూడా తనే కాల్చేసేది. ఖాళీసీసాలో రాకెట్ పెట్టి వెలిగించి దూసుకుపోతున్న రాకెట్ని చూసి ఆనందంతో ఎగిరేది. ఏమైపోయాయి ఆ రోజులన్నీ! స్త్రీ స్వేచ్ఛ కోరుకుంటే కొన్ని ఆనందాలకి దూరం కావాలా? సంప్రదాయాలకూ, ఆచారాలకు తలొగ్గి జీవిస్తేనే, ఈ సమాజంలో ఒకతిగా గుర్తింపబడి, గౌరవింపబడుతుందా? లేకపోతే ఇంతేనా!

గుండెల మీద ఏదో బరువు పెట్టినట్టు భారంగా గొంతులో ఏదో ఉండలా చుట్టుకుపోతోంది. బహుశా నొక్కివేసిన దుఃఖం కాబోలు.

రోజులు మామూలుగా గడిచిపోతున్నాయి. రమ్య చదువు మాత్రం కుంటినడక ప్రారంభించింది. రానురానూ సురేష్తో అనుబంధం బలపడుతూ, ఇదివరకులా వారానికో సారి కాకుండా రోజూ ఓసారి కలుసుకోవాలనిపిస్తోంది. కానీ, సురేష్ ఒక్కోరోజు ఫోన్ చేసినా దొరకడు. దాదాపు పది రోజులైంది. ఈసారి మామూలుగా రావాల్సిన శుక్రవారం నాడు కూడా సురేష్ రాలేదు. అలాంటి రాకపోవడాలు చాలాసార్లు జరిగింది. ఓసారి పాప పుట్టినరోజని, ఓసారి భార్య పుట్టినరోజని, మరోసారి ఒంట్లో బాగాలేదని. అలా ఏవో కారణాలు చెప్పి ఎగ్గొడుతున్నాడు.

పదిరోజులు దాటాక రమ్య సురేష్ ఆఫీస్కి ఫోన్ చేసింది. లీవ్లో ఉన్నాడని

చెప్పారు.

తనతో మాటమాత్రం చెప్పకుండా లీవ్ పెట్టడం ఏమిటి? కోపం వచ్చింది రమ్యకి. ఇంటికి ఫోన్ చేసింది. అతని భార్య రిసీవ్ చేసుకుంది.

"ఇంట్లో లేరు" అని ఠక్కున పెట్టేసింది.

రమ్య ఓ గంటాగి మళ్ళీ చేసింది. అదే సమాధానం. అలా ఆ రోజంతా ఎన్నిసార్లు ఫోన్ చేసినా సురేష్ కలవలేదు.

రమ్యకి నిద్రపట్టలేదు ఆ రాత్రి. తెల్లవారి లేస్తూనే హడావుడిగా తయారై సురేష్ ఇంటికి బయల్దేరింది, అడ్రస్ వెతుక్కుంటూ. ఆమె వెళ్ళేటప్పటికి హాయిగా కూర్చుని కాఫీ తాగుతూ, న్యూస్‌పేపర్ చదువుకుంటున్నాడు. రమ్యని చూసి చాలా కంగారుపడ్డాడు.

"నువ్వేంటి ఇలా" అన్నాడు గొంతు తగ్గించి.

"లీవ్ పెడ్తున్నట్టు నాకు చెప్పలేదేం!" కోపంగా అంది.

అతని భార్య వచ్చి అనుమానంగా రమ్యని చూస్తూ,

"ఎవరూ" అంది.

"తను నా కొలీగ్... ఆ శోభా కాఫీ ఇవ్వు తనక్కూడా" తడబడ్డాడు సురేష్.

సురేష్ ఆ ఇంట్లో అతని భార్య సమక్షంలో తనతో ప్రవర్తించిన తీరుకి రమ్యకి చిరాకేసింది. ఎందుకంత భయం! ఇంత భయం ఉన్నవాడు తనతో సంబంధానికి ఎందుకు ఒప్పుకోవాలి? అందుకేనా సీక్రెసీ ఉండాలి అంటూ తనని నోరు మూయించాడు. రమ్యని బస్ ఎక్కించడానికి వచ్చిన సురేష్ మండిపడ్డాడు.

"ఏం కొంపలంటుకుపోయాయని ఇంటికొచ్చావు?" రమ్య నిర్ఘాంత పోయింది అతని ధోరణికి.

"అదేమిటి సురేష్! పదిరోజులైంది నువ్వు కలిసి. కనీసం ఫోన్ చేయలేదు. పైగా లీవ్ పెట్టి ఇంట్లో ఉన్నావు. నాకేం తెలుసు? నీకు ఒంట్లో బాగాలేదో ఏమో! అని ఖంగారుపడ్డాను. ఏం మీ ఇంటికి రాకూడదా?"

"చూడు రమ్యా! నీకిదివరకే చెప్పాను. మాంసం తింటున్నాం కదా అని ఎముకలు మెళ్లో వేసుకు తిరగలేం. నాకేవో పనులున్నాయి. లీవ్ పెట్టాను. అందుకు నీకు సంజాయిషీ ఇవ్వాలా? నువ్వు ఫోన్ చేస్తున్నావనే రోజూ గొడవ. ఇంక ఇలా

ఇంటికొచ్చేస్తే నాకు న్యూసెన్స్ అవదా?"

రమ్య మండిపడుతూ అంది, "నేనూ నీకు చెప్పాను సురేష్! నా జీవితంలో సీక్రెసీ ఉండటం నాకిష్టంలేదని. నాకు నచ్చిన జీవన విధానాన్ని బహిరంగంగానే అనుసరిస్తానని."

"నువ్వు తెగించావు. నీకసలు భయంలేదు. నాకో గౌరవం ఉంది. అది పాడు చేయవద్దు రమ్యా"

రమ్య స్థాణువులా చూసింది.

"అంటే అంటే గౌరవం, శాంతి ఇలాంటివన్నీ నీకే కానీ నాకక్ఖర్లేదు అంతేనా! నేను చేస్తున్నది అంత గౌరవ హీనమైన పని అని నువ్వు భావిస్తున్నావా? నన్ను చూడకుండా ఉండలేక రోజూ ఓసారి కన్పించి వెళ్లాలనుకునే సురేషేనా నువ్వు? రోజుకు నాలుగుసార్లు ఫోన్ చేసే సురేషేనా? ఎంత మారిపోయావు!"

రమ్య నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో భావాలు. భాషకందనివి, నిర్వచనం లేనివి.

జీవితాంతం తోడుగా నడుస్తావనుకున్నాను. ఇలా మధ్యలో వదిలేస్తావా? ఈ ప్రపంచాన్ని ఎదిరించి కలిసి బతకాలనుకున్నాం. నీ భార్యనే కన్విన్స్ చేయలేవా?

ఆటో వచ్చింది. రమ్య నిశ్శబ్దంగా ఆటో ఎక్కింది.

మర్నాడు సురేష్ వచ్చాడు. రమ్య ఎప్పట్లా మనసారా ఆహ్వానించలేక పోయింది. రాగానే ఆరాటంగా దగ్గరకు తీసుకుని అల్లరిచేసే సురేష్ కూడా కొంచెం ముభావంగా ఉన్నాడు.

రమ్య కాఫీ ఇచ్చింది, తాగుతూ అన్నాడు. "రమ్యా! ప్రతి శుక్రవారం ఎక్కడికి వెళ్తున్నావని తను రోజూ గొడవ. నేను వారంవారం ఇక్కడికి రావడం కష్టం అవుతోంది. నాకు వీలైనప్పుడు వస్తుంటాను."

రమ్య నిశ్చలంగా కూర్చుని వింటోంది. తన జీవనయానంలో ఆటంకాలు మొదలయ్యాయా?

"ఇంట్లో మనశ్శాంతి ఉండటంలేదు. చూస్తూ చూస్తూ గొడవలు పెట్టుకోవడం నాకిష్టంలేదు."

"ఈ విషయం ఆలోచించేగా సురేష్, ఆవిడతో మన విషయం చెప్పమన్నాను. కానీ నువ్వేగా సీక్రెట్ అంటూ దాటేశావు. ఇలాగే అయితే మన బంధం

చిరకాలం నిలిచి ఉంటుందా?"

సురేష్ మాట్లాడలేదు.

రమ్య మళ్లీ అంది "సురేష్! ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నన్ను నువ్వు ప్రేమిస్తున్నానని చెప్పు"

"మతిపోయిందా? భార్యకెవరైనా అలా చెప్తారా?"

"చెప్పకుండా మోసం చేయచ్చా?"

"మోసం ఎలా అవుతుంది? తనకి నేనేం అన్యాయం చేస్తున్నాను?"

"అదే ప్రశ్న ఆవిడనే అడగచ్చుగా"

"రమ్యా ప్లీజ్! నన్ను విసిగించకు. నావల్ల కాని పనులు చేయమని నన్ను వేధించద్దు. నేనేం నిన్ను శాశ్వతంగా వదిలేస్తున్నానా? అర్థం చేసుకుని కోపరేట్ చేయచ్చుగా?" విసుగ్గా లేచాడు సురేష్.

రమ్యకి కోపం వచ్చింది. "నేనే కోపరేట్ చేయాలా? ఈమాట అక్కడ అడగలేవా?"

"ఎలా అడుగుతాను? తను నా భార్య"

"ఓ!" రమ్య గుండె కలుక్కుమంది. "భార్య" తనెవరు? సురేష్ భార్యేనా? భార్య ఎలా? తాళికట్టలేదే! ఓవేళ కట్టినా ఇలాగే ప్రవర్తిస్తాడుగా.

"నేను వెళ్తున్నాను" రమ్యని ఆలోచనల సుడిగుండంలో వదిలేసి వెళ్లి పోయాడు.

రమ్య విగ్రహంలా చాలాసేపు అలాగే కూర్చుంది.

నాలుగు రోజులదాకా రమ్య సురేష్‌కి ఫోన్ చేయలేదు. అతను రెండు మూడుసార్లు చేసినా ఆమె కలవలేదు. ఐదో రోజు సురేష్ రమ్య ఆఫీస్ దగ్గరికి వచ్చాడు. ఆఫీసులో అందరి కళ్లూ సురేష్‌నే చూస్తున్నాయి. రమ్య వెంటనే బయల్దేరి బైటికి వచ్చింది. రమ్య వెనకాల కూర్చోగానే స్కూటర్ స్టార్ట్ చేసి ఆబిడ్స్ వైపు పోనిచ్చాడు సురేష్.

"ఇటెక్కడికి?" అడిగింది.

సురేష్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

"చీర కొంటానికి" అన్నాడు.

"ఎవరికి?"

"నీకే... మర్చిపోయావా? ఆరో తేదీన నీ బర్త్‌డే"

నిజంగానే రమ్య మర్చిపోయింది. ఈమధ్య ఏమీ గుర్తుండటంలేదు.

"నీకు అంత బాగా గుర్తుందా?" అడిగింది.

"రమ్యా నీమీద నాకు ప్రేమలేదా? ఎందుకు గుర్తుండదు. పరిస్థితుల వలన కొన్నికొన్ని ఇబ్బందులు వస్తాయి. అంతమాత్రాన నాకు నీమీద ప్రేమలేదనుకుంటే ఎలా?" మృదువుగా అన్నాడు.

రమ్య మీద సురేష్ మాటలు మత్తుమందు చల్లినట్లుగా పనిచేయసాగాయి. పాపం! తను రెండుచోట్లా నలిగిపోతున్నాడు. తనే అర్థం చేసుకోవాలి. చదువు, సంస్కారం ఉన్న తను కూడా అతనితో దెబ్బలాడితే ఎలా?

స్కూటర్ చందన బ్రదర్స్ ముందు ఆగింది.

పార్క్ చేసి వచ్చిన సురేష్‌తో కలిసి షాప్ లోపలికి అడుగుపెడుతున్న రమ్య ఆగిపోయింది.

షూస్ షాప్‌లోంచి బైటికి వస్తోన్న ప్రమోద్ పక్కనే శ్రీధర్. ప్రమోద్ చేతిలో రెండు క్యారీబాగ్స్.

"ప్రమోద్" సంతోషంతో గట్టిగా అంటూ ముందుకు పరిగెత్తింది రమ్య.

ప్రమోద్ తలతిప్పి చూశాడు. ఆశ్చర్యంతో విచ్చుకున్న అతని కళ్లలో ఓ క్షణకాలం ఆనందం మెరిసి మాయమైంది. గబగబా ముందుకెళ్లిపోయాడు. ఆగిపోయి రమ్యనే ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తోన్న శ్రీధర్ ప్రమోద్ ముందుకెళ్ల డంతో అతణ్ణి అనుసరించాడు.

రమ్య మొహంలో నవ్వు ఎగిరిపోయింది. అవమానంతో మొహం ఎర్ర బడింది. కింది పెదవిని పంటితో బిగపట్టిన రమ్య మొహంలో విషాదచ్ఛాయలు చూసి అడిగాడు సురేష్.

"ఎవరు వాళ్ళు?" రమ్య కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తరువాత అంది.

"మా తమ్ముడు ప్రమోద్, మేనత్త కొడుకు శ్రీధర్"

సురేష్ మాట్లాడలేదు. ఆమె భుజం మీద చేయేసి "టేకిట్ ఈజీ" అన్నాడు. రమ్య నిశ్శబ్దంగా అలాగే నిలబడిపోయింది.

"పద రమ్యా! ఈ సంఘటన ఇంతటితో మర్చిపో, చీర తీసుకుందాం రా"

"వద్దు, మూడ్ బాగాలేదు. ఫ్లాట్‌కెళ్ళిపోదాం."

సురేష్ వెళ్లి స్కూటర్ తీసుకొచ్చాడు. పది నిమిషాల్లో ఫ్లాట్‌కెళ్లిపోయారిద్దరూ.

"మీ తమ్ముడు ఎందుకలా ప్రవర్తించాడో! అయినా ఇవన్నీ ఊహించినవేగా అంత బాధపడతావేం?" అన్నాడు సురేష్.

"బాధ కాదు సురేష్! నా కళ్లముందు పెద్దవాడైన ప్రమోద్‌కి కూడా నేను చులకనై పోయానా? ఆమాత్రం నన్నర్థం చేసుకోలేడా? ఆఖరికి శ్రీధర్ కూడా అలా వెళ్లిపోవడం... ఛ"

"అందరూ మనల్ని అర్థం చేసుకోవాలనుకుంటే ఎలా రమ్యా! అందరికీ నచ్చుద్దా మన అభిప్రాయాలు. అందుకే చెప్పాను నీకు ఎవరికీ చెప్పకుండా నీకు నచ్చినట్టు నువ్వు బతుకు అని. అందరికీ టాంటాం వేశావు. పైగా వాళ్లు అర్థం చేసుకోలేదని బాధ."

"సురేష్! నేను ఒక నెల రోజులో ఏడాదో కాదు నీతో బతకాలనుకున్నది జీవితాంతం. అలాంటప్పుడు అది రహస్యంగా ఎందుకుంచాలి? నేను ఎలాంటి జీవితం గడపాలనుకున్నా అందరికీ తెలిసేలా బతుకుతాను. నేను చేస్తున్నది తప్పేంకాదని నా అంతరాత్మకి తెలుసు. నేనిలా బతకడం వలన అటు నీ భార్యకీ, పిల్లలకీ, నీ కుటుంబానికికానీ, ఇటు ఈ సమాజానికి కానీ ద్రోహం జరగడంలేదు. ఏదన్నా ద్రోహం అంటూ జరిగితే అది నాకే. అలాంటప్పుడు నేనెందుకు అందరికీ భయపడాలి?" ఆవేశంగా అంది రమ్య.

"అందరికీ చెప్పినప్పుడు వాళ్ల ఆమోదం పొందాల్సిన అవసరంలేదా?"

"లేదు. వాళ్ళు ఆమోదించి ఏం చేస్తారు సురేష్? ఓ తాగుబోతు భర్తతోనో, శాడిస్టుతోనో వాడి తిట్లూ, దెబ్బలు భరిస్తూ బతికే భార్యని ఈ సమాజం ఆమోది స్తుందా? అలా ఆమోదించేట్లయితే అలాంటి సమాజాన్ని నేను బహిష్కరిస్తాను సురేష్! ఫ్లాట్‌లో వాళ్లు నన్ను పార్టీలకు, ఫంక్షన్లకు పిలవకపోయినా పెద్దగా బాధపడలేదు. అది వాళ్ల సంస్కారం అనుకున్నాను. మా ఆఫీసులో కొలీగ్స్ నా గురించి చెవులు కొరుక్కుంటే ఇగ్నోర్ చేశాను. అమ్మానాన్న నువ్వు ఉంపుడుగత్తెగా బతుకుతున్నావు అంటే నవ్వుకున్నాను. ఇప్పుడు ప్రమోద్ ఇలా ప్రవర్తించినా ఓ రోజు లేదా ఓ వారం బాధపడతాను. కానీకానీ నేను ప్రేమించిన నువ్వు నన్ను నిర్లక్ష్యం చేస్తే మాత్రం నేను భరించలేను. మొన్న మీ ఇంట్లో ప్రవర్తించిన విధంగా ఇంకోసారి ప్రవర్తిస్తే మాత్రం నేను నిన్ను ఎన్నటికీ క్షమించను. నీకేవన్నా ఇబ్బంది

ఉంటే నాకు చెప్పు, నాకు చేతనైనంత వరకూ మన బంధం కలకాలం నిలబడటా నికి నేను కోపరేట్ చేస్తాను."

"నిన్ను నిర్లక్ష్యం చేయగలనా రమ్యా? కాకపోతే కొన్ని సమయాల్లో తప్పదు. నువ్వంటే నాకు ఎంత ప్రేమ లేకపోతే నీ బర్త్‌డే గుర్తుంచుకుంటాను."

"కబుర్లు చెప్పకు. అసలు ఇన్నాళ్లూ మీ ఆవిడకి మన సంగతి చెప్పకుండా ఎందుకు దాచావు?" సీరియస్‌గా అడిగింది.

"ఎలా చెప్తాను చెప్పు? చెబితే ఏడుపులు, పెడబొబ్బలు."

"ఆ మాత్రం మీ ఇద్దరి మధ్యా అవగాహన లేదా? అది లేకుండా ఇన్నేళ్ల నుంచీ కాపురం ఎలా చేస్తున్నారు?"

"అబ్బా రమ్యా! ఊరికే అన్నిటికీ ఆర్గ్యూ చేయకు. అసలు నువ్విదివరకులా లేవు. ఇదివరకు నా మనసెక్కడున్నా రమ్యా రమ్యా అంటూ పలవరించేది. ఇప్పుడు నిన్ను తలుచుకుంటేనే భయంవేస్తోంది. ఏదో ఒక ప్రాబ్లమ్ చెప్పి నసపెడ్తున్నావు."

రమ్య ఛర్రున లేచింది.

"నసా! అవును మనిద్దరి జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నీ నా ఒక్క దానివే. నేను మాత్రమే ఇందుకు బాధ్యురాల్ని. నీకేం సంబంధంలేదు. ఎందుకంటే నీకంటూ సెపరేట్‌గా ఓ జీవితం ఉంది. నేను నువ్వు వచ్చినపుడల్లా నీ కౌగిట్లో వాలిపోయి తీయటి కబుర్లు చెప్తే మంచిదాన్ని. నా బాధ, వేదన నీకు చెప్పి కొంత ఓదార్పు పొందాలని ఆశించడం తప్పు అంతేగా! థాంక్యూ సురేష్! థ్యాంక్యూ! చాలా బాగా అర్థం చేసుకున్నావు."

రమ్య స్వరంలో వినిపించిన గుండెకు తగిలిన గాయం తాలూకు బాధ సురేష్ గుండెల్ని తాకింది. దగ్గరగా జరిగి ఆమె చుబుకం పట్టి కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

"సారీ రమ్యా! ఏదో చికాకులో అన్నాను. అయినా నువ్వే ఆలోచించు. నేను అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నాను. నిన్ను బాధపెట్టలేను. తనని కన్విన్స్ చేయలేను. వెరీ సారీ. నవ్వు రమ్యా ప్లీజ్! ఈ దెబ్బలాటలూ, చికాకులూ ఇవే సరిపోతున్నాయి. ఈమధ్య ఎన్ని రోజులైంది మనం సరదాగా గడిపి."

సురేష్ లాలనతో కూడిన మాటలు రమ్య కోపాన్ని కొద్దికొద్దిగా కరిగి పోయేలా చేస్తున్నాయి. దెబ్బలాటలు అన్న పదం ఆమెని గాభరా పెట్టింది. "మామధ్య గిల్లికజ్జాలే తప్ప దెబ్బలాటలుండవు" తండ్రితో తను ఛాలెంజ్ చేసింది. అవును

ఈ గిల్లికజ్జాలు చిలికి చిలికి గాలివాన కాకుండా కాపాడాల్సి ఉంది. నెమ్మది నెమ్మదిగా రమ్య స్త్రీత్వం లొంగిపోయింది.

***

"రమ్యా" రమ్య ఫైల్స్‌లోంచి తలెత్తింది. ఎదురుగా శ్రీధర్ చిరునవ్వుతో.

"నువ్వా!" సంభ్రమంగా చూసింది.

"నేనే... ఎలా వున్నావు?" ఆమె ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"ఫైన్! నువ్వెలా ఉన్నావు?" అడిగింది రమ్య బజర్ నొక్కుతూ.

"నేను బాగున్నాను. సారీ రమ్యా మొన్న..."

రమ్య కళ్లు కిందికి వాలిపోయాయి. ప్యూన్ వచ్చాడు రమ్య కాఫీ చెప్ప బోతోంటే అన్నాడు, "బిజీగా వున్నావా బైటికి రాలేవా?"

"ఏం లేదు, వెళ్దాం పద" అంది ఫైల్స్ మూసేస్తూ.

ఇద్దరూ బైటికి నడిచారు. కారు డోర్ తీసిన శ్రీధర్‌ని ఆశ్చర్యంగా చూస్తూ, "కారు ఎప్పుడు కొన్నావు?" సీటులో కూర్చుంటూ అడిగింది.

"చాలా కాలమైంది" స్టార్ట్ చేస్తూ అన్నాడు.

"అంటే నువ్వు ఇక్కడే ఉంటున్నావా?"

"లేదు, విజయవాడలో"

"అక్కడినుంచి కారులో వచ్చావా?"

"ఊఁ... దాదాపు పదిరోజులకోసారి వస్తాను. ఎరువులకోసం, సీడ్స్ కోసం. లగేజీ ఉంటుంది కదా ఎందుకీ బాధ అని కారు కొనేశాను. ప్రమోద్‌కి ఇక్కడే రిజర్వ్ బ్యాంక్‌లో ఉద్యోగం తెలుసా! ఈమధ్యే జాయిన్ అయ్యాడు."

రమ్యం కొంచెం సంతోషంగా ఇంకొంచెం కోపంగా "వెధవ! ఆ విషయం నాకు చెప్పచ్చుగా! నేనెవరో తెలీనట్టు వెళ్లిపోతాడా? స్టుపిడ్" అంది.

"వాడి తప్పుకాదు. మీ అమ్మానాన్నా స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి పంపారు నిన్ను కలవద్దని" కారు తాజ్ రెసిడెన్సీ ముందు ఆపాడు.

బటర్ మసాలా దోశ తింటూ "నేనేం తప్పుచేశాను చెప్పు అమ్మానాన్నా అంతగా నన్ను అసహ్యించుకోడానికి" అంది రమ్య.

శ్రీధర్ ఆప్యాయంగా... "రమ్యా! నీకేం తక్కువైందని రెండో పెళ్లివాణ్ణి ప్రేమించావు?" అన్నాడు.

"తక్కువ ఎక్కువ ప్రసక్తేం ఉంది. ప్రేమించాక తెల్సింది అతనికి పెళ్లైందని."

"అప్పుడైనా నీ అభిప్రాయం మార్చుకోవచ్చుగా"

"మార్చుకోలేకపోయాను. నా మనస్తత్వానికి ఇలాంటి జీవితమే బాగుంటుందనిపించింది. అతనూ ఒప్పుకున్నాడు."

"ఎందుకు ఒప్పుకోడు! బాధ్యతలు మోయక్ఖర్లేదంటే ఇద్దర్నేం ఖర్మ ఇరవై మందిని కూడా భరిస్తాడు మగవాడు. కానీ నువ్వు ఆడదానివి. నీకు జీవితాంతం ఓ తోడునీడగా ఉంటూ నీ కష్టసుఖాలు పంచుకునే వ్యక్తి భర్తగా ఉండడం ఎంతో అవసరం! సురేష్‌లాంటి పెళ్లైన వాడికి భార్యకాని భార్యగా ఉండటంచేత నీలో ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్ లేదా?"

"నేను సురేష్‌తో బతికేది సెక్యూరిటీ కోసం కాదు"

"మరి దేనికోసం?"

రమ్య మాట్లాడలేదు. ఈ ప్రశ్న ఇంతవరకు తనకు ఎదురవలేదు. దేనికోసం తను సురేష్‌తో కలిసి బతుకుతోంది? తోడు కోసమా? అలాగైతే అతని తోడు తనకి అనుక్షణం కావాలే. పోనీ రక్షణ కోసమా? తనకి తనే రక్షణ. మరి శారీరక సుఖం కోసమా? కేవలం దానికోసమే అయితే సమాజంతో సవాల్ చేస్తూ బతకడం దేనికి? చాటుమాటు శృంగారం జరిపితే ఎవరికీ తెలీదుగా! ఇదేదీ కాదు బతకడం కోసం అంతే...

"రమ్యా! అతని భార్యకి మీ విషయం తెలుసా?" నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అడిగాడు.

"తెలీదు"

"మరెలా మానేజ్ చేస్తున్నాడు? పండుగలూ పబ్బాలూ వస్తే నీతో ఉంటాడా? పెళ్లిళ్లకి, ఫంక్షన్స్‌కి నీతో వస్తాడా?"

సౌజన్య పెళ్లి కార్డు ఇచ్చినప్పుడు తనతో పెళ్లికి రమ్మంది. రానన్నాడు. కారణం అడిగితే ఆఫీసులో పని ఉందని చెప్పాడు. సౌజన్య అడిగింది కూడా 'సురేష్ రాలేదేం!' అని. తను దెబ్బలాడినా సురేష్‌కి వేరే కార్డ్ కూడా ఇచ్చింది.

"రాడు కదూ!" శ్రీధర్ నవ్వాడు. "పిచ్చి రమ్యా! ఎక్కడికక్కడ నాకిదే బావుంది, నేను ఫ్రీగా ఉండచ్చు. అనుకుంటూ రాజీపడిపోతూ బతుకుతున్నావు. కానీ నువ్వేం కోల్పోతున్నావో నీకర్థం కావడంలేదు. నీ నిర్ణయం... నీకు సమంజసం

గా అనిపించవచ్చు. సమాజాన్ని లక్ష్యపెట్టాల్సిన అవసరం నీకు లేకపోవచ్చు. కానీ నీ అంతరాత్మకి సమాధానం చెప్పుకోవాల్సిన రోజు ఒకసారి వస్తుంది. నువ్వెవరివి? రమాకాంత్ కూతురివా? సురేష్ భార్యవా? అన్న సమస్య ఎదురైన ప్పుడు నువ్వెవరివో తేల్చుకోలేక సతమతమవుతావు…" శ్రీధర్ కాఫీ ఆర్డరిచ్చి మళ్లీ అన్నాడు. "రమ్యా! జీవితం స్వాతిచినుకులాంటిది. ఈ ఉపమానం చాలాసార్లు వినే ఉంటావు. జీవితం నీటిబొట్టులా ఆవిరవాలని కోరుకునేవాళ్ళు మూర్ఖులు. స్వాతిముత్యంలా ప్రకాశించాలనుకునే వాళ్ళు అందుకు కృషిచేసేవాళ్ళు వివేకవం తులు. రమ్య వివేకం మీద నాకు నమ్మకం ఉంది. ఫెమినిజం పేరుతో అర్థంలేని స్వేచ్ఛ కోరుకుని, అర్థవిహీనమైన జీవితం గడుపుతున్నావు. నీ వివేకం మేల్కొని నీకేం కావాలో అంతరాత్మ సాక్షిగా తెలుసుకున్న రోజున నా సహాయం నీకుం టుంది. నేను నీ అంత చదువుకోలేదు. వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్న వాడిని. అయినా జీవితాలన్నీ చదివినవాడిగా నీకు సలహాలిస్తున్నాను. "మన సిద్ధాంతాలు మన జీవితాన్ని అందంగా… ఆహ్లాదంగా మలచాలి– విమర్శనాత్మ కంగా కాదు" రమ్య నిశ్శబ్దంగా సంభ్రమంగా వింటోంది శ్రీధర్ మాటల్ని.

"చాలా బాగా మాట్లాడావు శ్రీధర్. నాకు సాయం చేస్తానన్నందుకు చాలా థాంక్స్. కానీ నువ్వు భయపెట్టినంత వికృతంగా నా జీవితం మారదని ఆశిస్తాను. నా జీవితం నా స్వేచ్ఛని హరించేది కాకూడదు."

"ఎందుకలా అనుకుంటున్నావు? నీ స్వేచ్ఛని నువ్వు కాపాడుకుంటూ నీ ఆత్మాభిమానాన్ని పదిలపరుచుకుంటూ గడిపేలాగ పెళ్ళికి ముందే మాట్లాడు కోవాలి."

"బాగుంది పెళ్ళంటే అగ్రిమెంటా?"

"కలిసి బతకడంలో కూడా మీకో అగ్రిమెంట్ ఉందిగా?"

"అది వేరు…"

"ఎలా అవుతుంది? జీవితమే ఓ అగ్రిమెంట్. ఒప్పందం. ఈ ఒప్పందం అనేది ఆటవికుల నుంచి నాగరికుల దాకా అందరి మధ్యా ఉన్నదే"

"మొత్తానికి నేను చేస్తున్నది తప్పు అని ఒప్పించాలని ప్రయత్నిస్తున్నావా?" అంది రమ్య.

శ్రీధర్ నవ్వుతూ "ఎలాగైనా అనుకో… కానీ ఓ విషయం గుర్తుంచుకో, నీకీ బతుకు మీద విముఖత కలిగినప్పుడు, భవిష్యత్తు గురించిన సలహా కోసమైనా

నేనున్నానని మర్చిపోకు."

రమ్య కృతజ్ఞతగా చూసింది.

"చాలా సంతోషం శ్రీధర్. కనీసం నువ్వైనా నన్ను వెతుక్కుంటూ వచ్చి ఇంతసేపు మాట్లాడావు. పైగా అన్నివేళలా నేనున్నానంటూ నీ స్నేహహస్తం నాకందిస్తున్నావు. థాంక్యూ సోమచ్"

శ్రీధర్ లేచాడు. "నీ మొహం, మనలో మనకి కృతజ్ఞతలేమిటి?" రమ్య కూడా లేచింది. రమ్యని ఫ్లాట్ దగ్గర డ్రాప్ చేశాడు. లోపలికి రమ్మంది. తరువాత వస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

కారు కనుమరుగైందాకా చూసి పైకి వెళ్లిన రమ్య బాల్కనీలో నిల్చున్న సురేష్‌ని చూసి ఆశ్చర్యంగా అడిగింది.

"అరే! ఎంతసేపైంది వచ్చి" తాళం తీసింది.

సురేష్ జవాబివ్వలేదు. రమ్య లోపలికి నడిచి లైటు వేసింది. సురేష్ మొహం అసహనంగా ఉంది. "ఆఫీస్‌కి ఫోన్‌చేస్తే మధ్యాహ్నమే వెళ్ళావని చెప్పారు. ఎక్కడికెళ్ళావు?"

"శ్రీధర్ వచ్చాడు. బైటికెళ్ళాం..."

"బైటికంటే...?"

అతనడిగిన తీరుకి తలతిప్పి అతని మొహంలోకి చూస్తూ చెప్పింది "హోటల్‌కి'"

"ఇంతసేపా!" వాచీ చూసుకుంటూ అన్నాడు.

"ఏదో మాట్లాడుతూ కూర్చున్నాం. అయినా ఈ క్రాస్ ఎగ్జామినేషన్ ఏమిటి?" చిలిపిగా అతని క్రాఫ్ చెరిపేస్తూ అంది.

సురేష్ సీరియస్‌గా అన్నాడు.

"మొన్న కనిపించినా పలకరించనివాడు ఇవాళ ఆఫీస్‌కి ఎందుకొచ్చినట్లు? పైగా ఇంతసేపు అతనితో హోటల్లో గడపడం నీ పద్ధతి నాకేం నచ్చలేదు."

"వ్వాట్!" రమ్య ఆశ్చర్యంగా చూసింది.

"ఏవిటి సురేష్ ఉద్దేశం! మగాడిగా అనుమానిస్తున్నాడా? భర్తగా అధికారం చెలాయించాలని చూస్తున్నాడా?"

విసురుగా అంది "నేను హోటల్లో గడిపాను కానీ హోటల్ రూమ్‌లో

కాదు."

"రమ్యా! చూడు, ఆడది పెళ్ళి చేసుకుంటే గౌరవం, పెళ్ళి చేసుకోకపోయినా ఒకే మగాడితో బతికితే అదో రకం... అంతేకానీ ఇలా ఎవరితోపడితే వాళ్ళతో హోటల్స్‌కి వెళ్ళడం, సినిమాలకి తిరగడం, ఇంటికి తీసుకురావడం నాకు నచ్చదు."

"కానీ నాకు నచ్చుతుంది. నీకు నచ్చదని నేను మానాలా? సురేష్! మన అగ్రిమెంట్‌లో లేని విషయాలు మాట్లాడద్దు. ప్లీజ్..." తీవ్రంగా అంది.

"ఏంటి అగ్రిమెంట్... ప్రేమించేప్పుడు అగ్రిమెంట్ రాసుకున్నామా? మనం సొసైటీలో బతుకుతున్నాం. గుర్తుంచుకో"

రమ్యకి చిర్రెత్తుకొచ్చింది.

"ఏంటి గుర్తుంచుకొనేది. నాకు తెలుసు నేను సొసైటీలో బతుకుతున్నానని. అయినా నీకేమైంది ఇవాళ? పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నావు? నాకిలాంటి అనవసరమైన పెత్తనాలు ఇష్టం ఉండవని తెలుసుగా నీకు. ఉండు కాఫీ ఇస్తాను" అక్కడితో సంభాషణ తుంచేస్తూ లేచింది రమ్య.

సురేష్ కూడా లేచాడు. "కాఫీ అఖ్ఖర్లేదు. వెళ్తున్నాను"

"ఎందుకొచ్చావసలు?"

"నిన్ను చూడాలనిపించి వచ్చాను. చూశాను. కడుపు నిండింది. వస్తాను."

రమ్య మనసు విలవిలలాడింది. ఇవాళ అతనితో ఉండాలనిపిస్తోంది. శ్రీధర్‌తో మాట్లాడినవన్నీ అతనికి చెప్పాలని ఉంది. సురేష్ సాన్నిధ్యంలో తను వారంరోజుల నుంచీ పడిన మానసిక క్షోభకు సాంత్వన పొందాలని ఉంది. అందుకే మరోసారి ఓడిపోతున్న స్త్రీత్వంతో లాలనగా అంది.

"అనవసరమైన విషయాలు తీసుకొచ్చి అమూల్యమైన మనకాలం పాడుచేయకు సురేష్. ఇవాళ ఉండిపో ప్లీజ్" అంది.

"కుదర్దు. అయినా మన అగ్రిమెంట్ ప్రకారం నేను శుక్రవారంగా ఉండాల్సింది" మామూలుగా అన్నా అతని స్వరంలో వెటకారం రమ్య మనసుని గాయం చేసింది.

"దెప్పి పొడుస్తున్నావా?"

"దెప్పిపొడుపేంటి? నువ్వు నేర్పిందేగా" నిర్లక్ష్యంగా అన్నాడు.

"సరే వెళ్ళు నీకు మనసు కుదురుపడ్డాకే రా" నిర్లిప్తంగా అంది. సురేష్

వెళ్ళిపోయాడు. రమ్య గుండెల మీంచి అడుగులేస్తూ.

మర్నాడు, ఆ మర్నాడు వారం దాటింది. సురేష్ రాలేదు.

రమ్య మనసులో దిగులు. అటు తల్లిదండ్రులతో, ఇటు సమాజంతో సవాల్ చేసి తను స్వీకరించిన ఈ జీవితంలో తను ఓడిపోబోతోందా? ఎంతో తెలివైంది. వివేకవంతురాలు అన్న గర్వంతో తనెంచుకున్న సురేష్ కూడా మామూలు మగాడేనా? అతనిలో ప్రత్యేకమైన సంస్కారం, ధైర్యం, తెగింపు, ప్రేమించిన తన కోసం త్యాగం చేయాలన్న తపన ఏమీ లేవా? తనమీద అతనికి ఉన్నది ప్రేమకాదా? అదే అయితే... ఆ ప్రేమ ఇంత త్వరగా బలహీనపడిందేం? ఇలా నిర్వీర్యమైపోయిందేం? రమ్య మనసులో ఆలోచనలు అదిల్చిన తేనెపట్టు నుంచి గుంపుగా చెదిరిన తేనెటీగల్లా ముసురుకున్నాయి. ఇదివరకులా మళ్ళీ ఆ జీవితం పొందలేదా... తన ప్రేమ సామ్రాజ్యం శిథిలం కాబోతోందా?

నో! అలా కాకూడదు. రమ్య గబగబా వెళ్ళి సురేష్ నెంబరు డయల్ చేసింది. ఎంతో ఆరాటంతో పలకరించిన రమ్యతో ముభావంగా, ముక్తసరిగా మాట్లాడాడు.

రమ్య చాలా బాధపడింది. ఆత్మాభిమానం చంపుకొని తనే బతిమాలుతోంది ప్రతిసారీ. కారణం, సురేష్ తనవాడని. కానీ ఇదేంటి?

రమ్య ఆఫీసులో లోన్ తీసుకుని కెనెటిక్ హోండా కొనుక్కుంది. ఆరోజు ఆఫీసు నుంచి వస్తోంటే సౌజన్య, ఆమె భర్తా కలిశారు.

"సినిమాకు వెళ్తున్నాం నువ్వూ రాకూడదూ?" అంది సౌజన్య.

రమ్య మృదువుగా నిరాకరించింది.

ఆదివారం వాళ్ళింటికి రమ్మని మరీమరీ ఆహ్వానించారు దంపతులు.

ఆదివారం సురేష్ రాలేదు. రమ్య సౌజన్య ఇల్లు వెదుక్కుంటూ వెళ్ళింది.

గుమ్మంలో అడుగుపెట్టగానే ఘుమఘుమలాడే సాంబారు వాసనే కాక కళకళ్లాడే వారి దాంపత్యం కూడా రమ్య మనసుని దోచింది.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశాక కిరణ్ని వదిలేసి స్నేహితురాళ్ళిద్దరూ పెరట్లో కూర్చున్నారు.

"ఎలా ఉందే నీ జీవితం?" అడిగింది సౌజన్య.

రమ్య చిరునవ్వుతో అంది, "ఎలా ఉంటుంది? అనుకున్నట్టుగానే"

"మరైతే ఎలా? అలవాటుపడ్డావా? ఎదిరిస్తున్నావా?"

"ఎదిరించను సౌజన్యా, నా దారిలో నేను ముక్కుకు సూటిగా వెళ్లిపోతాను. నాదారిని హర్షించేవాళ్ళు, అనుసరించేవాళ్ళు ఉంటే ఆనందిస్తాను. విమర్శించే వాళ్ళని పట్టించుకోను, కానీ" ఆగిపోయింది రమ్య.

"ఊ కానీ..." రెట్టించింది సౌజన్య.

"సౌజన్యా? నేను వృత్తిరీత్యా ఎగ్జిక్యూటివ్‌ని. చదువుకున్నదాన్ని, పబ్లిక్ రిలేషన్స్‌లో పిహెచ్‌డి చేయాలన్న ఉద్దేశంతో బంధాలు, బాధ్యతలూ లేకుండా పెళ్ళైన సురేష్‌తో నా జీవితం పెనవేసుకున్నాను. కానీ నా లక్ష్యాన్ని మర్చిపోయి సురేష్‌తో అనుకోని బంధం పెరిగిపోయింది. ఎందుకనో... మనసు అతని సాంగత్యాన్ని అనుక్షణం కోరుకుంటోంది. తాత్కాలికంగా కోపం వచ్చినా మళ్ళీ అన్నీ మర్చిపోయి నేను అతనితో కాంప్రమైజ్ అవుతున్నాను. అలాగే నాలో పొసెసివ్‌నెస్ కూడా పెరిగిపోతోంది. ఇదంతా ఎందుకు జరుగుతోందో అర్థంకావడంలేదు."

సౌజన్య రమ్య చేయందుకుని మృదువుగా నిమురుతూ అంది.

"రమ్యా! దీన్నే ప్రేమానుబంధం అంటారు. అతనిమీద నీకున్న ప్రేమచేతే నీలో పొసెసివ్‌నెస్ పెరుగుతోంది. అదే మాంగల్యబంధంతో ముడేస్తే అతనిమీద హక్కు కూడా కోరతావు. మగవాడికి అవసరాలతోపాటు అధికారం కావాలి. మనం బంధాలతో పాటు బాధ్యతల్ని అంటగట్టాలి. అప్పుడే నా ఇల్లు, నా మనుషులు అన్న భావనతో ఓ నిర్దుష్టమైన జీవన విధానానికి కట్టుబడి ఉంటాడు. చూశావా? పెళ్ళికాకుండా బతికే నీకు, పెళ్ళి చేసుకుని బతికే సురేష్ భార్యకీ తేడా? రమ్యా! ఆడది ఎంత విప్లవ భావాలు కలిగి ఉన్నా ఆమెలో ఓ బలహీనత ఉంది. అదేంటంటే, ఒక కాలంలో ఒక మగవాడ్ని నమ్ముతుంది. తనకి తెలీకుండానే ఈ సమాజం తనకు నిర్దేశించిన నీతిసూత్రాలను అనుసరించి బతకడానికే ప్రయత్నిస్తుంది. ఆ బలహీనతకే ప్రేమ అని, ఆరాధన అనీ పేర్లు పెట్టుకుంటుంది. ఆ బలహీనతని జయించలేరు. కాబట్టి ఆడవాళ్ళు మాంగల్యానికి ప్రాధాన్యత నిస్తారు. అంతేగానీ దానికేదో పవిత్రత ఉందనికాదు. అది లేనంత మాత్రాన భర్త ఆయుష్షుకి గండం ఉంటుందన్న సెంటిమెంట్‌తో కూడా కాదు. ఒక్క మగవాడితో కట్టుబడి ఉండాలన్న సూత్రాన్ని కాపాడేది మంగళసూత్రం కాబట్టి."

రమ్య సౌజన్య వైపు అభినందనగా చూసింది.

"ఆడవాళ్ళ హిపోక్రసీని ఎంత అందంగా నిర్వచించావు సౌజన్యా!"

"టీ తాగుదామా" అంటూ నవ్వింది సౌజన్య.

"ఆ... కొంచెం ఆగు నువ్వింత మాట్లాడావు, నేను కూడా కొంత మాట్లాడాలిగా"

"ఓ యస్, మాట్లాడు" బుద్ధిగా కూర్చుంది సౌజన్య.

రమ్య జామచెట్టు మీద పాకుతున్న ఉడుతని చూస్తూ– "సౌజన్యా! నువ్వన్నది అక్షరాలా నిజమే! పెళ్లి, సూత్రం అనేవి మగవాడిని కట్టేస్తాయన్నది వాస్తవం కావచ్చు. కానీ, నా సిద్ధాంతం ప్రకారం ప్రేమ పొందాలంటే మనిషిని కట్టేయాలి కానీ ఓ పసుపు తాడుతో కాదు. ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లి చేసుకున్న భార్యాభర్తలు విడిపోతున్న ఈ రోజుల్లో ఏ శాస్త్రమూ, మంత్రమూ లేకుండా పరస్పర అవగాహనతో కలిసి ఉండగల స్త్రీ పురుషులు ఉంటే ఎంత బాగుంటుంది అన్నదే నా అభిమతం. ఏది ఏమైనా నా సిద్ధాంతం మాత్రం మారదు" అంది.

సౌజన్య నిట్టూర్చింది.

"ఓ.కె! ఆల్ ది బెస్ట్. రా, టీ తాగుదాం"

ఇద్దరూ లేచి లోపలికి నడిచారు.

సాయంత్రం దాకా అక్కడే గడిపి తిరిగి వచ్చేసింది రమ్య. తను వస్తోంటే సౌజన్యా, కిరణ్ "అప్పుడప్పుడు వస్తూండు" అన్నారేకానీ "సురేష్‌ని తీసుకురా" అనకపోవడం గమనించింది. అంత సంతోషకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆ ఒక్క విషయం తీయని రాగంలో చిన్న అపశృతిలా రమ్య మనసులో చేదు అనుభూతిని మిగిల్చింది.

***

వారం, పదిరోజులుగా బలవంతంగా అణచుకున్న అనురాగం, అభిమానం ఆ క్షణంలో వెల్లువై పొంగాయి. దారిలో కెనెటిక్ హోండా ఆపి, సురేష్‌కి ఫోన్ చేసింది. సురేష్ కూతురు కాబోలు రిసీవ్ చేసుకుని "డాడీ లేరండి... మమ్మీ, డాడీ సినిమాకెళ్ళారు" అని చెప్పింది.

ఆమె మనసులో ఒక్కసారిగా ముళ్ళు దిగినట్టనిపించింది. ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది. నీరసంగా ఫ్లాట్‌కెళ్ళి కళ్ళు మూసుకు పడుకుంది. సౌజన్య దంపతులు, సురేష్, అతని భార్య, అమ్మా, నాన్న, ఫ్లాట్స్‌లోని దంపతులు ఒక్కొక్కరే ఆమె కళ్లముందు జంటలు జంటలుగా కదలసాగారు.

కాళ్ళల్లో, అరచేతుల్లో సన్నని ప్రకంపన. గుండెల్లో అలజడి. నిశ్శబ్దంగా ఉన్న ఆ వాతావరణంలో ఊపిరాడనట్లైంది. వంటరితనం వెక్కిరిస్తున్నట్టని

పిస్తోంది. ఏంటిలా? ఏం జరుగుతోంది? పదిరోజులైంది సురేష్ తన దగ్గరికి రాక. ఆ స్పృహే లేకుండా భార్యతో సినిమాకెళ్ళాడు ఇంతేనా? ఇంక ఎప్పటికీ ఇలాగేనా? కానీ...కానీ ఈ నిర్లక్ష్యాన్ని తనెంతకాలం భరించగలదు?

సురేష్‌కి తనకీ మధ్య దూరం పెరిగిపోతోంది. ఆ దూరం తగ్గించాలని తను ప్రయత్నిస్తోంది. అసలు ఆ దూరం ఏర్పడకుండా ఉండడానికి తనెంత సహనం వహించింది. మొదట్లో రోజుకోసారి పలకరించాలనిపించేది. తరువాత రోజూ కలిస్తే బాగుండుననిపించేది. ఆ తరువాత కలిసి బతకాలనిపించింది. బతకడం ప్రారంభించాక తనలో కలిగే అనుభూతులన్నీ అతనితో పంచుకోవాలని తహతహలాడింది. మెల్లిమెల్లిగా విడిచి ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంటే భయపడి బలవంతంగా ఆ కోరికను నిగ్రహించుకుంది. అయితే ఇప్పుడు అతను రోజుల తరబడి రాకపోయినా బతుకుతోంది. వారానికోసారి కలుసుకున్నా, కలుసుకోబోయే రోజు కోసం ఎదురుచూస్తూ, ఎదురుచూసిన క్షణాల్ని పదిలపర్చుకుంటూ బతికిన ఆ రోజులు తీయగా ఉండేవి. వారం తరువాత కలుసుకుంటామన్న ఆశతో, నమ్మకంతో ఎదురుచూడడంలో విరహ బాధ ఉండేది. ఇప్పుడు ఆ ఆశా, నమ్మకం సన్నగిల్లిపోతున్నాయి. విరహం స్థానంలో వేదన, నిరీక్షణ నిండిన కళ్ళల్లో నిరాశా నిస్పృహలు చోటు చేసుకుంటున్నాయి. గుండెల్లో బాధ, రగులుతున్న అగ్ని గుండంలా.

అమ్మా, నాన్నా, సౌజన్యా, శ్రీధర్ ఎవరేం చెప్పినా వినలేదు. పక్కవాళ్ళు, ఎదురు వాళ్ళు, కొలీగ్స్ విమర్శలతో గురి చూసి బాణాలు విసిరినా పట్టించుకోలేదు. ఆఖరికి తోడబుట్టిన తమ్ముడు తనని పలకరించకపోయినా ఎక్కువగా బాధపడ లేదు. ఈ చింతలన్నింటికీ సురేష్ పరిష్వంగంలో సేదతీరింది.

కానీ ఇప్పుడు సురేష్ తనని అవమానిస్తున్నాడు. నిర్లక్ష్యంతో దూరం అవుతున్నాడు. తననో అంటరానిదానిలా అతని కుటుంబాన్నించి, అతని వ్యక్తిగత జీవితాన్నించి వెలేస్తున్నాడు. ఈ బాధ ఎవరికి చెప్పుకోవాలి? శ్రీధర్ మాటలు గుర్తొచ్చాయి. “రేపు నువ్వెవరివి? అని నీ అంతరాత్మ నిలదీస్తే ఏం జవాబిస్తావు? రమాకాంత్ కూతురివా? సురేష్ భార్యవా?”

నిజమే! తనెవరు? తన ఉనికి ఏమిటి? ఈ సమాజంలో తన స్థానం ఏమిటి?

ఒకరి భార్యగానో, మరొకరి కూతురిగానో, ఓ కుటుంబానికి కోడలిగానో తప్ప రమ్యగా తనకేం స్థానం లేదా ఈ సమాజంలో? గౌరవం లేదా? ఎంతసేపటికీ

స్త్రీ కుటుంబ వ్యవస్థలో కుదించుకుపోయి బతకాలే తప్ప స్వతంత్రంగా, తనదైన ఓ ప్రత్యేక స్థానం ఈ సమాజంలో కల్పించుకునే అవకాశం లేదా? తనకి జీవితం ఓ తీయటి పాటలా ఉండాలని కోరిక.

తనకిష్టమైనప్పుడు, తీరిక ఉన్నప్పుడు ఆ వాంఛ కలిగినప్పుడే ఆ పాటలోని తీయదనాన్ని ఆస్వాదించాలని అనిపిస్తుంది కానీ ఇదేంటి? ఈ సమాజం తనకిష్ట మైన పాట వినవద్దని శాసిస్తుందేం? అలా శాసించే హక్కు ఈ సమాజానికి ఎవరిచ్చారు? బతికితే రమాకాంత్ కూతురిగా లేదా మరోవ్యక్తి భార్యగా బతుకు అని అంటారేం వీళ్ళంతా... ఎందుకలా బతకాలి? అవును ఎందుకలా బతకాలి? తను రమ్య. అంతే! రమ్యగానే బతుకుతుంది.

***

*(విపుల, ఆగస్టు 1998)*